**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499

A.P VISION TV

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | శుక్రవారం 06-06-2025 | సంపుటి : 11 | సంచిక : 132 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యం

పర్యావరణ పరిరక్షణలో ఏపిని అగ్రగామిగా నిలబెడతాం

వచ్చే ఏడాదికల్లా ప్లాస్టిక్ వినియోగం లేకుండా చేస్తాం

వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తాం

రాఖీ రోజున అన్నల నక్షత్రానికి అనుగుణంగా విత్తనాల పంపిణీ

వనజీవి రామయ్య స్ఫూర్తిని మువలేము

పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు

పవన్ కళ్యాణ్‌తో కలసి మొక్కలు నాటిన బాబు



అమరావతి,జూన్5: వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి పరిధిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మొన్నటి వరకు వనజీవి రామయ్యను చూశామని.. ఆయన లేకపోయినా ఇప్పుడు నల్లమల పరిరక్షణ కోసం అంకారావు కృషి చేస్తున్నారని అన్నారు. ఈరోజు ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని.. దీని పర్యావసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి చెట్ల వల్ల ఉపయోగం తెలియదని.. వారికి చెట్లు నరకడం తప్ప చెట్లు పెట్టడం తెలియదని విమర్శించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వెళితే కింద రోడ్డుపై చెట్లు నరికేవారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తుంటే ఎక్కడైనా ఒక్క చెట్టు తాము నరుకుతున్నామా అని ప్రశ్నించారు. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారన్నారు. చెట్లు నరికితే మనిషిని చంపినట్టే అని కొన్ని దేశాల్లో చట్టాలు కూడా ఉన్నాయన్నారు. నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37 శాతం గ్రీన్ కవర్ రావాల్సి ఉందన్నారు. జీవితంలో 10 చెట్లు కంటే ఎక్కువ పెట్టి పెంచుతున్నవారు ఉన్నారని.. అసలు చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది అని సీఎం చంద్రబాబు నిలదీశారు. అందుకే ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది. అటవీ విస్తీర్ణం పెంచడంలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. దీంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పద్మశ్రీ వనజీవి రామయ్య నా వద్దకు ఎప్పుడు వచ్చినా.. మొక్క తీసుకుని వచ్చేవారు. ఆయన్ను అందరం స్మరించుకోవాల్సిన అవసరముంది. ఇవాళ 16 రకాల మొక్కలు నాటాం.



మూడేళ్ల వరకు మనం మొక్కను కాపాడితే తర్వాత అదే పెరుగుతుంది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం కూడా పర్యావరణ పరిరక్షణలో కీలకమైంది. స్వర్ణాంధ్ర అంటే కేవలం ఆదాయం పెంచడం మాత్రమే కాదు. ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవడమూ అందులో భాగమే. నా మనసుకు బాగా దగ్గరగా ఉండే సబ్జెక్ట్



పర్యావరణ పరిరక్షణ అని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం మనుషులకే కాదు.. జంతువులకూ ప్రమాదంగా మారింది. మనం తినే తిండి, పండించే పంటలు ప్లాస్టిక్ మయం అవుతున్నాయి. కొందరు చికెన్ వ్యర్థాలను చేపల పెంపకంలో వాడుతున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తే... అనారోగ్య సమస్యలు వస్తాయి. స్వార్థంతో కాకుండా అందరం భావితరాల కోసం బతకాలి.

# పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తాం: పవన్ కల్యాణ్



అమరావతి: కోటి మొక్కలు నాటి.. వాటిని సంరక్షించడమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అడవిలో కార్చిచుల నివారణకు, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని అన్నారు. మానవ జీవితంలో ప్రకృతికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు మొక్కలు, చెట్లు ఆనవాళ్లుగా ఉన్నాయని వెల్లడించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు కానీ, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని ఉద్ఘాటించారు పవన్ కల్యాణ్.పర్యావరణ పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇవాళ(గురువారం) అనంతవరంలోని ఏడీసీఎల్ పార్క్‌లో వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, మంత్రులు, హాజరయ్యారు. అనంతవరం పార్క్ సమీపంలో రాగి, వేప మొక్కలను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కోటి మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రమాణం చేశారు.

# విశాఖలో నిర్వహించే యోగా కార్యక్రమం గిన్నీస్ బుక్ రికార్డ్ సాధించాలి: సీఎం చంద్రబాబు

అమరావతి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ యోగా కార్యక్రమం గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించాలని ఆకాంక్షించారు. విశాఖపట్నంలోని ఆర్కేబీచ్‌లో 5 లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు జారీ అవుతాయని ప్రకటించారు. యోగా అనేది ప్రజలందరి జీవితంలో భాగమైందని.. ప్రజలు ఆరోగ్యవంతులు కావాలని కోరుకున్నారు. ఏపీలో గ్రీన్ కవర్ పెంచటం, గ్రీన్ ఎనర్జీ సాధించటం, సర్క్యులర్ ఎకానమీ, ప్రజల ఆరోగ్యం కోసమే యోగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇదే స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రిస్తాం..ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడమే లక్ష్యంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్లాస్టిక్ మానవాళికి పెనుసవాల్‌గా మారిపోయిందని తెలిపారు. ఆవులు, గేదెలు ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయని.. ఆ పాలనే మనం తాగుతున్నామని వివరించారు. ఏనుగులు కూడా ప్లాస్టిక్ తిని అనారోగ్యం పాలవుతున్నాయని చెప్పారు ముఖ్యమంత్రి చంద్రబాబు.ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడా కనిపించకుండా చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. భూతాపంతో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయని.. గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికి సవాల్‌గా మారిందని చెప్పుకొచ్చారు. వర్షాలు తగ్గాయి, భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి, సాగునీరు తగ్గిపోతోందని అన్నారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ పెరిగి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఏపీలోని 68 నియోజకవర్గాల్లో ఉన్న నగరవనాలను 175 నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

# మొక్కలు నాటుదాం..పర్యావరణం కాపాడుదాం

రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలను నాటే కార్యక్రమం

పర్యావరణ సమతౌల్యతతోనే జీవన ప్రమాణాలు

ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్





విజయవాడ,జూన్5:మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం -2025 కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లి వద్ద నగరవనం వద్ద మంత్రి సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీశ మొక్కలను నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మొక్కలు నాటుదాం.... పర్యావరణాన్ని కాపాడుదాం... అనే వినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతౌల్యత పాటు జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో మొక్కలు నాటడం మాని చెట్లను నరికివేసేవారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటడాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు.

# 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేశాం

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్డిఎ కృషి

ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ వెల్లడి



న్యూఢిల్లీ,జూన్5: పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలియచేశారు. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి. మోదీ సర్కార్ 3.0 ఏర్పడి జూన్ 9 నాటికి ఏడాది పూర్తి కానుంది. దీంతోఆయన 11 ఏళ్లపాటు నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగినట్లవుతుంది. ఈసం దర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మంత్రివర్గ సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకొని.. వాటిని సాధిం చేందుకు ఉత్సాహంగా సూచించారు.

# పీఎస్సార్‌కు మళ్లీ షాక్..రిమాండ్‌పై కోర్టు ఆదేశాలివే

విజయవాడ, జూన్ 5: ఏపీపీఎస్సీలో అవకతవకల కేసులో ఏ1గా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు రిమాండ్ పొడిగించింది కోర్టు. ఈ కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు పీఎస్సార్. నేటితో (గురువారం) రిమాండ్ ముగియడంతో కోర్టులో ఆయనను పోలీసులు హాజరుపర్చారు. ఈ క్రమంలో ఈనెల 19 వరకు రిమాండ్ పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పోలీసులు తిరిగి పీఎస్సార్‌ను జిల్లా జైలుకు తరలించారు.ప్రధానంగా ఏపీపీఎస్సీలో అవకతవకలకు సంబంధించి మొత్తం వ్యవహారం పీఎస్సార్ చుట్టూనే తిరిగినట్లు విచారణలో పోలీసులు నిర్ధారించారు. గత వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో గ్రూప్ 1వ మూల్యాంకణానికి సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు వ్యక్తుల చేత మూల్యాంకణం చేయించారని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు ఏ1గా పీఎస్సార్ ఆంజనేయులు, ఏ2గా ధాత్రి మధును పోలీసులు అరెస్ట్ చేశారు. పీఎస్సార్ చెబితేనే ఈ మొత్తం వ్యవహారం నడిపించానని ధాత్రి మధు తన స్టేట్‌మెంట్‌లో చెప్పుకొచ్చారు.



# సంపాదకీయం

శుక్రవారం 06-06-2025

## అమెరికా దివాళ తీస్తోందా...

ప్రపంచ దేశాలకు పెద్దన్న.. అగ్రరాజ్యం..సంపన్న దేశం అమెరికా త్వరలోనే దివాలా తీస్తుందట. అవును ఈ మాటలు అన్నది మరెవరో కాదు..అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్) బాధ్యతలను నిర్వర్తించి ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్. అందుకే అమెరికా దివాలా వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ట్రంప్ సర్కార్ తెచ్చిన ట్యాక్స్ బిల్లును వ్యతిరేకిస్తున్న మస్క్ ఇప్పటికే డోజ్ సారధ్య బాధ్యతల నుంచి వైదొలిగారు. కాంగ్రెస్ అమోదం కోసం వచ్చిన ట్యాక్స్ బిల్లుపై మస్క్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. నన్ను క్షమించండి..నేను ఇంతకంటే భరించలేను..'బిగ్ బ్యూటిఫుల్ బిల్' అత్యంత దారుణమైంది..కాంగ్రెస్ వ్యయ బిల్లు  బిల్లు చాల చెడ్డది. దీంతో అమెరికన్లపై అధిక భారం పడుతుందని తెలిపారు. అది తప్పుడు బిల్లు అని మీకు తెలుసు. దీనికి ఓటు వేసిన వారు సిగ్గు పడాలి. అయినా ఈ బిల్లుకు మద్దతుగా ఓటేశారంటే అది మీకే అవమానం అని పేర్కొన్నారు. ఈ బిల్లు కారణంగా ద్రవ్యలోటు 2.5ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని..ఇది ఇలాగే కొనసాగితే అమెరికా దివాలా తీయడం ఖాయమని మస్క్ హెచ్చరించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య చెడిందనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలో ఓ బిల్లు విషయమై ట్రంప్పై మస్క్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్రంప్ ప్రతిపాదించిన ఖర్చు బిల్లును 'అసహ్యకరమైన ఘోరమైన చర్య'గా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల వైట్ హౌస్ నుంచి మస్క్ నిష్క్రమించిన తరువాత, ఈ ఇద్దరి మధ్య ఉన్న విబేధాలు తాజాగా బయటపడ్డాయి. మస్క్ గత వారం డోజ్ చీఫ్ పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వ వృథా ఖర్చులను నివారించి, పాలనలో పారదర్శకత కోసం డోజ్‌ను ట్రంప్ ఏర్పాటుచేశారు. ధీనికి నాయకత్వం వహించిన మస్క్.. ఖర్చులను నివారించడాన్ని ట్రంప్ ప్రశంసించారు. కానీ అప్పటికే ఇద్దరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి.'ఈ భారీ, దారుణమైన, అర్థరహిత ఖర్చులతో నిండిన కాంగ్రెస్ బిల్లు ఒక అసహ్యకరమైన ఘోరమైన చర్య. ఇది మానవాళిపై భారంగా మారుతుంది.. దీనికి ఓటేసిన వారందరికీ సిగ్గుపడాలి. మీరు తప్పు చేశారన్న విషయం మీకే తెలుసు' అని మస్క్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు. 'ట్రంప్ బిగ్, బ్యూటిఫుల్ బిల్'పై మస్క్ ఈ వ్యాఖ్యలు చేయడం తొలిసారి కాదు. ఈ బిల్లు వచ్చే 10 ఏళ్లలో అమెరికా రుణాలను 3 ట్రిలియన్ డాలర్లకు పెంచుతుందని అంచనా. ఇది ఆరోగ్య, ఆహార సహాయం వంటి ముఖ్యమైన కార్యక్రమాలకు భారీగా కోతలు పెట్టే ప్రయత్నంగా భావిస్తున్నప్పటికీ.. వాస్తవానికి ఖర్చు పెరుగుతాయి.డోజ్ శాఖ అధ్యక్షుడు ట్రంప్ రెండో పదవీ కాలంలో ఏర్పాటైంది. దీని ప్రధాన లక్ష్యం ప్రభుత్వ వ్యయంలో వృథాను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచడం. ఎలాన్ మస్క్, టెస్లా, స్పేస్ఎక్స్ సీఈవోగా తన అనుభవాన్ని ఉపయోగించి, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులను సూచించారు.ఎలాన్ మస్క్, ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త, ఆవిష్కర్త, అమెరికా అధ్యక్ష సలహాదారుగా తన పదవి నుంచి వైదొలగడం ఒక ముఖ్యమైన రాజకీయ సంఘటనగా నిలిచింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' (డోజ్) శాఖ సారథిగా మస్క్ అందించిన సేవలు, అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. అయితే, మే 30న తన పదవి గడువు ముగియడంతో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మస్క్‌కు ఘనమైన వీడ్కోలు పలికారు.డోజ్ శాఖ అధ్యక్షుడు ట్రంప్ రెండో పదవీ కాలంలో ఏర్పాటైంది. దీని ప్రధాన లక్ష్యం ప్రభుత్వ వ్యయంలో వృథాను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచడం. ఎలాన్ మస్క్, టెస్లా, స్పేస్ఎక్స్ సీఈవోగా తన అనుభవాన్ని ఉపయోగించి, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులను సూచించారు. ఉదాహరణకు, అనవసరమైన ప్రభుత్వ ఉద్యోగాలను తొలగించడం, బడ్జెట్ కోతల ద్వారా ట్రిలియన్ డాలర్ల వథా ఖర్చును నియంత్రించడం వంటి సంస్కరణలను ప్రతిపాదించారు. ఈ సంస్కరణలు ప్రభుత్వ ఖర్చులను 20?30% వరకు తగ్గించే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే మస్క్ వ్యాపార దృక్పథం, ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యం డోజ్ శాఖను ఒక ప్రత్యేకమైన సంస్థగా మార్చాయి. అయితే, ఈ సంస్కరణలు కొంతమంది వద్ద విమర్శలను కూడా రేకెత్తించాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు సూచనలపై.మే 30న మస్క్ అధ్యక్ష కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో, ట్రంప్ ఆయనకు బంగారు రంగు తాళం చెవిని బహుమతిగా అందించారు. ఈ బహుమతి ప్రత్యేక వ్యక్తులకు మాత్రమే అందించబడుతుందని, ఇది దేశం తరఫున మస్క్ సేవలకు గుర్తింపుగా ఇవ్వబడిందని ట్రంప్ తెలిపారు. ప్రెస్ మీట్‌లో మస్క్ అవిశ్రాంత కృషిని, ఆవిష్కరణలను, దేశ అభివృద్ధికి అందించిన సహకారాన్ని ట్రంప్ కొనియాడారు. ఈ గుర్తింపు మస్క్ యొక్క ప్రభావాన్ని మరియు డోజ్ శాఖ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది.మస్క్ వైదొలగడం వెనుక బహుముఖ కారణాలు ఉన్నాయి. అమెరికా చట్టాల ప్రకారం, ఒక వ్యక్తి 130 రోజులకు మించి ఈ హోదాలో కొనసాగలేరు, ఇది మస్క్ పదవీ కాలం ముగింపుకు ఒక చట్టబద్ధ కారణం. అయితే, మీడియా కథనాల ప్రకారం, ట్రంప్ 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్' కు వ్యతిరేకతగా మస్క్ ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొనబడింది. ఈ బిల్ ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతుందని, డోజ్ శాఖ లక్ష్యాలను నీరుగారుస్తుందని మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. అదనంగా మస్క్ వ్యతిరేకత కూడా ఒక కారణంగా చెప్పబడుతోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రకారం, మస్క్ ఈ ఒప్పందాన్ని ఆపాలని ట్రంప్‌పై ఒత్తిడి చేసినప్పటికీ, ట్రంప్ దానిని పట్టించుకోలేదని తెలుస్తోంది. ఈ విభేదాలు మస్క్ నిర్ణయంపై ప్రభావం చూపి ఉండవచ్చువీడ్కోలు సందర్భంలో మస్క్ తన భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించారు.

# ఎన్డీయేకు పాశ్వాన్ పార్టీ గుడ్ బై



పాట్నా, జూన్ 5,మరో ఏడాదిలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపులు చోటు చేసుకుంటున్నాయి. బీహార్ అధికార కూటమిలో సైతం చీలికలు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్డీయే కూటమిలో మంత్రిగా ఉన్న లోక్ జన శక్తి పార్టీ (రాంవిలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్.. ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు. జాతీయ రాజకీయాలకు దూరం కావాలని భావిస్తున్నట్టు ప్రకటించారు. 'జాతీయ రాజకీయాల్లో ఎంతోకాలం ఉండలేనని నేను గతంలో కూడా చెప్పాను. బీహార్, బీహారీ ప్రజల కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను' అని పాశ్వాన్ సోమవారం మీడియాకు చెప్పారు. 'బీహార్, బీహార్ ప్రజలే తొలి ప్రాధాన్యం అనేదే నా దృక్కోణం. బీహార్ అభివృద్ధి చెందాలని, ఇతర అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీపడాలని ఎల్లప్పుడూ నేను కోరుకుంటాను. నేను మూడోసారి ఎంపీగా గెలిచిన తర్వాత ఢిల్లీలో ఈ పని సాధ్యం కాదని నాకు తెలిసివచ్చింది' అని అన్నారు. చిరాగ్ పాశ్వాన్ ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న విషయం తెలిసిందే. తన ఉద్దేశాన్ని పార్టీ పెద్దలకు ఇప్పటికే తెలియజేశానని ఆయన పేర్కొన్నారు. వీలైనంత త్వరగా తిరిగి బీహార్‌కు రావాలన్న నా ఆకాంక్షను పార్టీ ముందు ఉంచాను. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నేను పోటీ చేయడం పార్టీకి ఉపయోగపడుతుందా? అనే విషయంలో మా పార్టీ పరిశీలన చేస్తున్నది. నేను అసెంబ్లీ ఎన్నికల్లో మంచి సామర్థ్యం ప్రదర్శించగలనని, మా కూటమి కూడా సామర్థ్యం చాటుందని భావించినట్టయితే నేను అసెంబ్లీకి కచ్చితంగా పోటీ చేస్తాను' అని చిరాగ్ పాశ్వాన్ తెలిపారు.చిరాగ్ పాశ్వాన్ రాజకీయ ఆకాంక్షలపై చాలా చర్చలే ఉన్నాయి. అయితే.. ఆయన మాత్రం ముఖ్యమంత్రి పదవి విషయంలో ఊహాగానాలను కొట్టిపారేస్తున్నారు. 'బీహార్‌లో ప్రస్తుతం సీఎం పోస్టు ఖాళీగా లేదు.. ఎన్నికల తర్వాత కూడా నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి అవుతారు' అని ఆయన చెప్పారు. పాశ్వాన్‌ను రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దింపే విషయంలో త్వరలోనే ఎల్జేపీ ఒక లాంఛన ప్రకటన చేస్తుందని భావిస్తున్నారు. రిజర్వ్‌డ్ సీటు నుంచి కాకుండా జనరల్ స్థానం నుంచి పాశ్వాన్ పోటీ చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నదని ఎల్జేపీ బీహార్ ఇన్‌చార్జ్, జుమాయి ఎంపీ అరుణ్‌భారతి అన్నారు. 'చిరాగ్ ఏదో ఒక వర్గానికి మాత్రమే చెందిన నాయకుడు కాదు కనుక అతను జనరల్ స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ భావిస్తున్నది' అని ఆయన తెలిపారు. తద్వారా రాష్ట్ర రాజకీయాల్లో మరింత పెద్ద పాత్ర పోషించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెళతాయి' అని ఆయన పేర్కొన్నారు.జూన్ 8వ తేదీన భోజ్‌పూర్ జిల్లా అరాలో నవ్ సంకల్ప్ మహాసభ పేరిట పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో చిరాగ్ పాశ్వాన్ అసెంబ్లీకి పోటీ చేయడంపై లాంఛన ప్రకటన ఉంటుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాలపై కేంద్రీకరించాలని చిరాగ్ నిర్ణయించుకున్నారని, జాతీయ నాయకత్వ పాత్ర నుంచి తప్పుకోవాలని భావిస్తున్నారని పార్టీ సీనియర్ నేతలు ధృవీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే మోదీ క్యాబినెట్ నుంచి కూడా ఆయన తప్పుకుంటారని తెలుస్తున్నది. బీహార్ అసెంబ్లీకి అక్టోబర్, నవంబర్ నెలల మధ్య మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. బీహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే బీజేపీ, జేడీయూ కూటమితోపాటు ఆర్జేడీ నేతృత్వంలోని కాంగ్రెస్, ఇతర పార్టీల ఇండియా కూటమి బరిలో ఉండగా.. తాజాగా ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సూరజ్ పార్టీ కూడా సై అంటున్నది. ఈ ముక్కోణ పోటీలో గెలుపెవరిదన్నది ఆసక్తికరంగా మారింది.

# నేను విన్నాను... నేను ఉన్నాను అంటున్న కేటీఆర్



హైదరాబాద్, జూన్ 5, కేటీఆర్, జగన్ మోహన్ రెడ్డి ప్రసిద్ధ డైలాగ్ "నేను విన్నాను... నేను ఉన్నాను"ను ఒక ఇంటర్వ్యూ లేదా బహిరంగ సమావేశంలో ఉటంకించారని సోషల్ మీడియా పోస్ట్‌లు సూచిస్తున్నాయి. ఈ డైలాగ్ జగన్ 2019 ఎన్నికల సమయంలో తన పాదయాత్రలో విస్తృతంగా ఉపయోగించిన "నేను విన్నాను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) కొన్ని రోజులుగా సహనం కోల్పోతున్నారు. ఓటమి తర్వాత కేటీఆర్ వైఖరిలో చాలా మార్పులు వచ్చాయి. అప్పటి వరకు డీసెంట్ నేత అనుకున్న అందరూ ఆయన నోటివెంట వస్తున్న మాటలు చూసి షాక్ అవుతున్నారు. తాజాగా ఆయన తన మిత్రులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డైలాగులను ఉటంకిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవి రాజకీయ వర్గాల్లో సంచలనం రేకెత్తించాయి. సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ డైనమిక్స్‌పై కొత్త చర్చకు దారితీసింది.కేటీఆర్, జగన్ మోహన్ రెడ్డి ప్రసిద్ధ డైలాగ్ "నేను విన్నాను? నేను ఉన్నాను"ను ఒక ఇంటర్వ్యూ లేదా బహిరంగ సమావేశంలో ఉటంకించారని సోషల్ మీడియా పోస్ట్‌లు సూచిస్తున్నాయి. ఈ డైలాగ్ జగన్ 2019 ఎన్నికల సమయంలో తన పాదయాత్రలో విస్తృతంగా ఉపయోగించిన "నేను విన్నాను? నేను ఉన్నాను" అనే నినాదం నుంచి పుట్టింది, ఇది మొదట వైఎస్ రాజశేఖర రెడ్డి బయోపిక్ "యాత్ర" సినిమాలో ప్రముఖంగా వినిపించింది.2023లో ఒక యూట్యూబర్ సందీప్‌తో జరిగిన ఇంటర్వ్యూలో కేటీఆర్, జగన్‌తో తన వ్యక్తిగత స్నేహాన్ని ప్రస్తావిస్తూ, వారిద్దరూ దావోస్ పర్యటనలో రెండు గంటల పాటు కలిసి డిన్నర్ చేశామని చెప్పారు. ఈ సందర్భంలో జగన్‌ను "పెద్దన్న లాంటి వాడు" అని సంబోధించారు. ఈ స్నేహం, రాజకీయ సందర్భంలో జగన్ డైలాగులను కేటీఆర్ ఉపయోగించడానికి ఒక నేపథ్యంగా కనిపిస్తుంది. 2025 మార్చి 23న ఒక ఎక్స్ పోస్ట్‌లో, కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులను ఉత్తేజపరిచిందని, ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని పేర్కొన్నారు.కేటీఆర్ జగన్ డైలాగులను ఉపయోగించడం వెనుక రాజకీయ వ్యూహం కనిపిస్తుంది. 2023 తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఓటమి తర్వాత, కేటీఆర్, జగన్ ఇద్దరూ తమ పార్టీలను పునర్నిర్మించే ప్రయత్నంలో ఉన్నారు. కేటీఆర్, జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా, వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారుల మనోభావాలను ఆకర్షించే ప్రయత్నం చేసి ఉండవచ్చు, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సమానమైన రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో. జగన్ యొక్క "నేను విన్నాను? నేను ఉన్నాను" డైలాగ్ ప్రజల సమస్యలను ఆలకించడం, వారికి అండగా ఉండటం అనే సందేశాన్ని సూచిస్తుంది. కేటీఆర్ ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా తెలంగాణలో ప్రజలతో తన సాన్నిహిత్యాన్ని, వారి సమస్యల పట్ల తన నిబద్ధతను చాటి ఉండవచ్చు. అలాగే, ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా జగన్‌తో తన స్నేహాన్ని, రాజకీయ సహకారాన్ని హైలైట్ చేసే ప్రయత్నం కూడా కనిపిస్తుంది.కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ఒక ఎక్స్ పోస్ట్‌లో, "జగన్ అన్న డైలాగ్ కేటీఆర్ గారు చెప్తే ఫైర్" అని పేర్కొన్న యూజర్, ఈ వ్యాఖ్యలు వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులను ఉత్తేజపరిచాయని తెలిపారు. ఈ డైలాగ్ వైరల్ కావడంతో, రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో కేటీఆర్ వ్యూహాత్మకంగా జగన్ ఇమేజ్‌ను ఉపయోగించుకున్నారనే చర్చ మొదలైంది.అయితే, ఈ వ్యాఖ్యలు కొంత వివాదాన్ని కూడా రేకెత్తించాయి. 2024లో ఒక నివేదిక ప్రకారం, కేటీఆర్, జగన్ ఇద్దరూ సోషల్ మీడియా ద్వారా రాజకీయ ప్రచారం చేయడంలో ఓడిపోయారని, వారి సోషల్ మీడియా వ్యూహాలు ఓట్లుగా మారలేదని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం కొందరు సోషల్ మీడియా ఆధారిత రాజకీయ ఆకర్షణగా చూస్తున్నారు, మరికొందరు దీనిని రాజకీయ స్నేహానికి సంకేతంగా భావిస్తున్నారు."నేను విన్నాను? నేను ఉన్నాను" డైలాగ్ జగన్ రాజకీయ ఇమేజ్‌కు సినిమాటిక్ ఆకర్షణను జోడించింది. ఈ డైలాగ్ మొదట "యాత్ర" సినిమాలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి చెప్పగా, జగన్ తన పాదయాత్రలో దీనిని రాజకీయ నినాదంగా మార్చారు. ఈ డైలాగ్ 2022లో మహేష్ బాబు నటించిన ''సర్కారు వారి పాట'' సినిమాలో కూడా ఉపయోగించబడింది, దీనిపై వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు.కేటీఆర్ ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా, జగన్ యొక్క రాజకీయ, సాంస్కృతిక ప్రభావాన్ని తెలంగాణ సందర్భంలో ఉపయోగించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తుంది. ఈ డైలాగ్ యొక్క సినిమాటిక్, రాజకీయ నేపథ్యం దానిని సోషల్ మీడియాలో వైరల్‌గా మార్చడానికి దోహదపడింది. ఇక ఇప్పుడు ఎవరినీ వదిలి పెట్టం.. విదేశాల్లో ఉన్నా పట్టుకొస్తాం.. అంటూ కేటీఆర్ జగన్ డైలాగులు చెబుతున్నారు.ఇప్పుడు నేతలు చెబుతున్న డైలాగులన్నీ అధికారులను బెదిరించేందుకే. కేసీఆర్ సర్కారే దీనికి మొదట తెరతీసింది. ఏపీలో జగన్ కూడా అధికారులను రాజకీయాలకు వాడుకున్నారు. అధికారం కోల్పోగానే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, టీడీపీ అదే పనిచేస్తున్నాయి. దీంతో ఇప్పుడు ప్రతిపక్ష నేతలు గగ్గోలు పెడుతున్నారు. అధికారులను తమ దారికి తెచ్చుకునేందుకే ఇలాంటి డైలాగులు కొడుతున్నారు.

# గులాబీలో దెయ్యాలు మాయమైనట్టేనా

హైదరాబాద్, జూన్ 5, ఖీ పార్టీలో ఏం జరుగుతోంది. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో ఏం జరగబోతోంది. కవిత విషయంలో నెక్ట్స్ ఏంటి.. షోకాజ్ నోటీసులు ఇస్తారా.. ఇవ్వరా.., కవితపై చర్యలు తీసుకుంటారా లేదా.. ఇంతకీ కవిత కొత్త పార్టీ పెడుతుందా.. ఇలా ఎన్నో ప్రశ్నలు .. ఇన్నాళ్లు లక్షలాది మెదళ్లను కదిలిస్తూనే ఉన్నాయి. కానీ తాజాగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే..ఈ ప్రశ్నలకు సమాధానం మాత్రం దొరకదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.మే 2 వతేదిన బీఆర్ ఎస్ పార్టీ అధినేత, తన తండ్రి కేసీఆర్ కు ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత లేఖరాశారు. మైడియర్ డాడీ అంటూ మొదలుపెట్టి, మీరు అలా మాట్లాడటం బాగుంది, కానీ ఇలా కూడా మాట్లాడవలసింది. బిజెపితో దోస్తీ అనే అనుమానం రాకుండా విమర్శల డోస్ పెంచాల్సింది. అంటూ బిఆర్ఎస్ వరంగల్ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగంపై , పార్టీలో అనుమానాలు , కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయంపై లేఖలో వివరిస్తూ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు..మే 22వ తేది.. సరిగ్గా లేఖ రాసిన ఇరవైరోజుల తరువాత కవిత రాసిన లేఖ లీకైయ్యింది. మీడియా చేతికి కవిత తండ్రికి రాసిన సీక్రెట్ లేఖ చిక్కింది. ఇంకేముంది వరుస కథనాలతో మీడియా హోరెత్తించింది. పార్టీలో ఇన్నాళ్లు గుట్టుచప్పుడుకాకుండా ఉన్న లోపాలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. మే 23వ తేది.. అమెరికా పర్యటన తిరుగు ప్రయాణంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న కవిత మీడియాతో మాట్లడారు. తాను రాసిన లేఖ లీక్ పై ప్రశ్నించిన మీడియా సైతం అవక్కాయ్యేలా సొంత పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. తన తండ్రి కేసీఆర్ దేవుడు అంటూ మొదలుపెట్టి, ఆయన చుట్టూ కొన్ని దెయ్యాలున్నాయి, పార్టీ నుండి కోవర్టులను బయటకు పంపాలి. తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.మే 29వ తేది.. నేను జైలులో ఉన్నప్పుడు బిజెపిలో బిఆర్ ఎస్ విలీనం చేసేందుకు సిద్దమైయ్యారు. ఆ ప్రయత్నాన్ని నేనే అడ్డుకున్నానంటూ తెలంగాణ రాజకీయాల్లో గ్రానేడ్ పేల్చింది. నా జోలికొస్తే బాగోదు. నాపై విదేశాల నుండి  బీఆర్ ఎస్ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారంటూ మీడియా చిట్ చాట్ లో తీవ్ర పదజాలంతో సొంత పార్టీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు కవిత. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే స్పందించలేదు కానీ, మరో నేతకు నోటీసులు ఇస్తే నానా హంగామా చేస్తారా అంటూ నేరుగా అన్న కేటీఆర్, బావ హరీష్ రావులను టార్గెట్ చేశారు.ఇదే చివరిగా బీఆర్ ఎస్ పార్టీపై కవిత చేసిన విమర్శలు. నేరుగా మీడియా కెమెరాల ముందు ఓసారి, చిట్ చాట్ పేరుతో మరోసారి సొంత పార్టీలో పరిణామాలపై  విరుచుకుపడిన కవిత, ఆ దెయ్యాల వల్లే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ధిక్కార స్వరంతో మాట్లాడిన కవిత. ఆ తరువాత మూడు సార్లు మీడియా సమావేశాల్లో మాట్లాడినా, ఎక్కడా పార్టీ ఊసే తేలేదు. దెయ్యాల విషయం తేల్చాలంటూ ప్రశ్నించలేదు. లేఖ లీకు వీరుల మాటెత్తలేదు. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేనట్లుగా మే 31వ తేది తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ప్రారంభించారు. కేసీఆర్ కు కాళేశ్వరంపై నోటీసులు ఇవ్వడం అంటే తెలంగాణకు నోటీసులు ఇవ్వడమేనంటూ, ఈనెల 4వ తేదిన మహాధర్నాకు పిలుపునిచ్చారు.ఇలా పార్టీపై తీవ్ర ధిక్కార స్వరంతో మే 23వ తేదిన మొ?దలైన కవిత ఎపిసోడ్ కు కేవలం ఆరే ఆరు రోజుల్లో గతనెల 29వ తేదితో బ్రేక్ పడింది. ఈ బ్రేక్ తాత్కాలికమా లేక శాశ్వతమా అనేది క్లారిటీ లేదుకానీ ,ఒక్కటైతే స్పష్టమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. అంతన్నారింతన్నారే.. అన్నట్లుగా కవిత వ్యాఖ్యలతో బిఆర్ ఎస్ లో లీకు వీరులపై చర్యలు తీసుకుంటారు, లేదా కవితకు షోకాజ్ ఇస్తారు అనే ప్రచారం జరిగింది. వడ్డించేవాడు మనవాడైతే.. బంతిలో చివరిన కూర్చున్నా అన్నీ అందుతాయనే సామెతే ఉండేనే ఉంది. అచ్చం ఆ సామెతను తలదన్నేలా ., కవిత ఎపిసోడ్ ముగిసిందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. చిట్ చాట్ లో మాట్లడిన మాటలపై షోకాజ్ ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చు. కానీ శంషాబాద్ ఎయిర్ పోర్టు సాక్షిగా మీడియా  కెమెరాల ముందు కేసీఆర్ చుట్టూ దెయ్యాలు అంటూ పార్టీ పరువు పోయేలా మాట్లడారు కవిత.

# రేషన్... పరేషాన్...

కరీంనగర్, జూన్ 5, సన్నబియ్యానికి తెలంగాణలో డిమాండ్ పెరిగింది. తెలంగాణలో రేషన్ షాపుల ముందు ప్రజలు బియ్యం తీసుకోవడానికి పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడలేక సంచులు, చెప్పులు పెడుతున్నారు. ఒక వ్యక్తికి రేషన్ ఇచ్చేందుకు దాదాపు 30 నిమిషాల సమయం పడుతుందని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడంతో ఉదయం ఆరు గంటల నుంచే క్యూలో నిల్చొని, సర్వర్ ప్రాబ్లం ఉండడంతో గంటల తరబడి క్యూ లైన్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎందుకు ఆలస్యమవుతుందని రేషన్ డీలర్లను నిలదీయగా, సర్వర్ ప్రాబ్లం ఉందని సాంకేతిక నిపుణులు వచ్చి సరి చేసేవరకు ఏం చేయలేమని సమాధానం ఇస్తున్నారు. కూలి పనులు, ఉద్యోగాలు మానుకొని లైన్ లో నిలుచుంటున్నామని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇచ్చేముందు సాంకేతిక లోపాలను సరిచేసుకోవడం తెలియదా అంటూ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రేషన్ ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. రేషన్ దుకాణాల్లో తెలుపు రంగు రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో ప్రజలు హ్యాపీ ఫీలవుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చేటప్పుడు ఇంతటి రష్ ఉండేది కాదని రేషన్ దుకాణాల డీలర్లు చెబుతున్నారు. చాలా వరకూ బియ్యాన్ని తీసుకునే వారు కాదని, కొందరు తీసుకున్న బియ్యాన్ని బయట వ్యాపారులకు విక్రయించే వారని చెబుతున్నారు.సన్న బియ్యం కావడంతో... సన్న బియ్యం కావడంతో అందులోనూ ఉచితంగా ఇవ్వడం, ఇంట్లో ఎంత మంది ఉన్నప్పటికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తుండటంతో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. తెలంగాణలో మొత్తం 90 లక్షలకు పైగా రేషన్ కార్డులున్నాయి. అందులో మూడుకోట్ల మందికి సన్నబియ్యాన్ని తెలంగాణ ప్రభుత్వం అందిస్తుంది. ప్రతినెల రేషన్ దుకాణాలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తుంది. ఎక్కడా బియ్యం కొరత అంటూ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

# మంత్రులకు సుతి మెత్తని క్లాస్

విజయవాడ, జూన్ 5, ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రులు మాట్లాడే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంత్రుల మధ్య సమన్వయం కొరవడితే నవ్వుల పాలవుతామని, ఒకే అంశంపై మాట్లాడేటప్పుడు అందరూ ఒకే విధంగా మాట్లాడితే ప్రజల్లోకి సరైన పద్ధతిలో వెళుతుందని చంద్రబాబు అన్నారు. అంతే తప్ప ఎవరికి వారు ఒకే అంశంపై వేర్వేరు విధంగా మాట్లాడితే ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకత పెంచుకునే అవకాశముందని చెప్పారు. అందుకే మాట్లాడే ముందు మంత్రులు సబ్జెక్ట్ పై అవగాహనకు వచ్చి మాట్లాడాలని, సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా మంత్రులందరూ చంద్రబాబుకు అభినందనలు తెలిపారుకొందరు మంత్రుల పనితీరును... అయితే మంత్రులు ఇంకా పనితీరును మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని, కేవలం శాఖపరమైన విషయాలు మాత్రమే కాకుండా పార్టీ సంబంధిత విషయాలను గ్రౌండ్ లెవెల్లో ఏం జరుగుతుందన్నది ఎప్పటికప్పుడు తెలుసుకుని తమకు కేటాయించిన జిల్లాల్లో పరిస్థితులను తమకు తెలియజేయాలని కోరారు. అలాగే కార్యకర్తలకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని కూడా చంద్రబాబుఅన్నారు. ఈ ఏడాదిలో అనేక మంది కొత్తగా మంత్రి పదవులు చేపట్టారని, వచ్చేఏడాదికి పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని చంద్రబాబు సూచించారు. చాలా మంది మంత్రుల పనితీరు బాగుందని, అయితే కొందరు మాత్రం కొంత తమ వ్యవహారశైలితో పాటు పనితీరులో కూడా మార్పులు చేసుకోవాలని ఆయన అన్నారు... ప్రత్యర్థి పార్టీ నేతల అరెస్ట్ ల గురించి ఆలోచించవద్దని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసి ఉంటే ఖచ్చితంగా అరెస్ట్ అవుతారని చంద్రబాబు తెలిపారు అది జగన్ అయినా మరొకరయినా ఒకటే న్యాయం ఉంటుందని అన్నారు. నిత్యం ప్రజల్లో మమేకమవుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, సోషల్ మీడియాలో పాటు పత్రికల్లో వచ్చే వార్తలకు కూడా మంత్రులు స్పందించాలని, లేకపోతే అందులో వచ్చే వార్తలు నిజమని ప్రజలు భావించే అవకాశముంటుందని, ఆ ఛాన్స్ ఎవరూ తీసుకోవద్దని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు ముందుండాలని కూడా చంద్రబాబు మంత్రులను ఆదేశించారు.ఏడాది పాలనపై బాగుందనే ఫీలింగ్ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కావస్తుంది. ఈ ఏడాది పాలనలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై చర్చ జరుగుతుంది. అయితే కూటమి ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించడం లేదు. ఏడాది మాత్రమే కావడంతో ప్రజలు ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. అదే సమయంలో జగన్ ఐదేళ్ల పాలనతో బేరీజు వేసుకుని చూస్తే ఇటు పరవాలేదని చెప్పలేని పరిస్థితి. అటు బాగా లేదని అనలేని స్థితి ఉంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ప్రతి ఒక్కరి మనసులో అభివృద్ధి జరగాలని ఆశిస్తారు. అదే సమయంలో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఉండాలని భావిస్తారు. అయితే ఏడాదిలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల అంచనాలు, ఆలోచనలు అందుకోలేకపోయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.. రోడ్లు బాగుండాలని కోరుకుంటారు. పరిశ్రమలు రావాలని అనుకుంటారు. పది మందికి ఉపాధి అవకాశాలు దక్కాలని ఆశిస్తారు.

నిరుద్యోగ సమస్య లేకుండా తక్కువ ధరలకు నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు సహజంగా కోరుకుంటారు. ఈ విషయాల్లో కూటమి ప్రభుత్వానికి మంచి మార్కులే పడతాయి. ఎందుకంటే వచ్చిన వెంటనే రహదారులను మరమ్మతులు చేశారు. పరిశ్రమలు కూడా ఒక్కొక్కటి వస్తున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగయితాయన్న భావన ప్రజల్లో ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి సహకారం అందుతుండటంతో నిధులు సమకూరడంతో పాటు పరిశ్రమలు కూడా త్వరగానే వస్తాయని ప్రజలు భావిస్తున్నారు. అయితే మిగిలిన తొమ్మిది నెలల్లో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుంటే పరవాలేదని పించేలా ఉందని ప్రజలు అంటున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలపై మాతరం పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛను నాలుగు వేల రూపాయలకు పెంచడం ఒకే. అదే సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అందచేస్తున్నారు. అంతకు మించి రైతులకు, మహిళలకు, విద్యార్థులకు సంబంధించిన పథకాలను గ్రౌండ్ చేయలేకపోవడంతో ఒకింత ఆ వర్గం ప్రజలు మాత్రం పెదవి విరుస్తున్నారు. జగన్ హయాంలో తమ బ్యాంకు అకౌంట్లో డబ్బులు ఉండేవని, కానీ కూటమి సర్కార్ ఏర్పాటయిన ఏడాదిలో అకౌంట్ లోకి పైసా పడకపోవడంపై ఒకింత అసంతృప్తి కనిపిస్తుంది. కానీ చంద్రబాబు మాత్రం గత ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిందని, వరసగా అన్ని పథకాలను అమలు చేస్తామని, ఇచ్చిన హామీలతో క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పడం ఒకింత ఊరటనిచ్చే అంశమే. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అందచేయనున్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని కూడా అమలు చేస్తామని ప్రకటించారు. కానీ ఒకేసారి కాకుండా విడతల వారీగా జమ చేస్తామని చెప్పడం ఒకింత ప్రజల్లో అసహనంకలుగుతుంది. రెండు నుంచి మూడు వేలు వస్తే ఉపయోగం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరొకవైపు ఆగస్టు పదిహేనో తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు అందిస్తుండటంతో రానున్న కాలంలో ఈ ఒపీనియన్ లో మార్పు వచ్చే అవకాశముందన్న భావనలో టీడీపీ నేతలున్నారు.

## వేగంగా కొనసాగుతున్న నకిలీ నెయ్యి కేసు

తిరుమల, జూన్ 5, తిరుమల శ్రీవారి లడ్డులో వినియోగించే నెయ్యి లో కల్తీ జరిగిందినే కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కి పిఏ గా పని చేసిన అప్పన్నకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. బుధవారం నుంచి మూడు రోజులు పాటు తిరుపతి లోని సిట్ కార్యాలయంలో అప్పన్నను సీట్ అధికారులు ప్రశ్నించనున్నారు. నత్వరలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి, మాజీ ఈవో ధర్మారెడ్డికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. టీటీడీ మాజీ జేఈవో కి సహ ఇతర అధికారులకు నోటీసులు ఇచ్చి విచారించనున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. 2024 సెప్టెంబర్‌లో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో జంతు కొవ్వు , చేప నూనెతో కూడిన కల్తీ నెయ్యి ఉపయోగించినట్లు ఆరోపించారు. దర్యాప్తు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. అయితే, సిట్ దర్యాప్తుపై పారదర్శకత లేని ఆరోపణలు రావడంతో, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఆధ్వర్యంలో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేశారు. ఈ బృందంలో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు సభ్యులుగా ఉన్నారు.ఈ కేసులో ఇప్పటివరకు 15 మందిని నిందితులుగా పేర్కొనగా, వీరిలో 6 మందిని సిట్ అరెస్టు చేసింది. తమిళనాడులోని ఏఆర్ డెయిరీ, ఉత్తరాఖండ్‌లోని బోలేబాబా డెయిరీ, యు తిరుపతిలోని వైష్ణవి డెయిరీకి చెందిన వ్యక్తులు అరెస్టు అయ్యారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో తెర వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై సిట్ విచాణ జరుపుతోంది. కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి టెండర్ నిబంధనలను మార్చిన సూత్రధారులపై సిట్ దృష్టి సారించింది. ఏఆర్ డెయిరీకి టెండర్ దక్కేలా వైఎస్ఆర్‌సిపి హయాంలో టీటీడీ పాలకవర్గంలోని కొంతమంది సభ్యులు, అధికారులు పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.లభించిన ఆధారాలతో ఖఆ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నకు సిట్ నోటీసులు జారీ చేసి, ప్రశ్నిస్తున్నారు. అప్పన్నతో పాటు మరో ఆరుగురు టీటీడీ ఉద్యోగులను కూడా ప్రశ్నిస్తున్నారు. ప్రాథమికంగా లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడారని గుర్తించారు. ఈ క్రమంలో అక్రమాలు ఎవరు చేశారు.... అవినీతి ఎలా జరిగింది.. కల్తీ నెయ్యిలో ఏమేమి కల్తీ అయ్యాయన్నది వెల్లడి కావాల్సి ఉంది. ఇవన్నీ వెల్లడి అయితే .. దర్యాప్తు నివేదికను సీబీఐ సుప్రీంకోర్టుకు సమర్పించే అవకాశం ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో హర్యానా గ్యాంగ్ కలకలం

తిరుపతి, జూన్ 5,చిత్తూరు జిల్లా కుప్పంలో హర్యానాకు చెందిన దొంగల ముఠా రెచ్చిపోయింది. కుప్పం మీదుగా సరిహద్దు దాటుతుండగా.. మంగళవారం అర్ధరాత్రి పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కారులో వెళ్తున్న దొంగలు పోలీసులను తొక్కించబోయారు. పోలీసులు కాల్పులు జరిపి వారిని ఆపడానికి ప్రయత్నించారు. అనంతరం దొంగలు కారును వదిలి పారిపోగా.. పోలీసులు వారి కోసం గాలిస్తు?న్నారు. కుప్పం డీఎస్పీ రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కృష్ణగిరి – పలమనేరు నేషనల్ హైవేపై తనిఖీలు చేపట్టారు. తంబిగానిపల్లె చెక్‌పోస్ట్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా.. రాత్రి 10.30 గంటలకు ఒక కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న స్కార్పియో కారును ఆపారు.ఆ కారులో తనిఖీలు చేసేందుకు ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లగా.. వెంటనే దొంగలు కారును వెనక్కి పోనిచ్చి వారిపైకి ఎక్కించే ప్రయత్నం చేశారు. కానిస్టేబుళ్లు అప్రమత్తమై వెంటనే పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే అప్రమత్తమైన సీఐ మల్లేష్ యాదవ్ కాల్పులు జరిపారు. తన సర్వీసు రివాల్వర్‌తో కారు డ్రైవర్ కాలుకు తగిలేలా కాల్చారు. కాల్పులు జరిపిన తర్వాత దొంగలు కారుతో సహా అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు వెంటనే టీమ్‌లుగా ఏర్పడి వారి కోసం గాలించారు. కారు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు దాటకపోవడంతో కుప్పం పరిసర ప్రాంతాల్లో గాలింపు కొనసాగిస్తున్నారు. నిందితులు పరమసముద్రం చెరువు దగ్గర కారును వదిలి పారిపోయారన్నారు పోలీసులు.హత్యాయత్నం కింద దొంగలపై కేసు నమోదు చేశామన్నారు డీఎస్పీ పార్థసారథి. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నామని.. ఈ క్రమంలోనే డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించామన్నారు. ఒకవేళ ఎక్కడైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న వివరాలను బట్టి కారులో ఐదుగురు ఉన్నారన్నారు.

## దారి మళ్లుతున్న రేషన్ బియ్యం




కాకినాడ, జూన్ 5, రేషన్ సరకులు పక్కదారి పట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రేషన్ షాపుల్లోనే నేరుగా రేషన్ ఇస్తోంది. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రేషన్ బియ్యం వద్దు అన్న వాళ్లకు నిత్యవసర సరకులు ఇచ్చేందుకు సిద్దమైంది. ఇలా చేయడం వల్ల బియ్యం పక్కదారి పట్టకుండా చూడొచ్చని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలం నుంచి రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయం తెలిసిందే. ఎన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నా చట్టాల్లోని లోపాలని వినియోగించుకొని కేటుగాళ్లు తప్పించుకుంటున్నారు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయడం వల్ల ఇలాంటి దందా విపరీతంగా పెరిగిపోయిందని ప్రభుత్వం షాపుల ద్వారా పంపిణీ చేపట్టింది. కానీ ఇలా పంపిణీ చేపట్టిన తొలి రోజే భారీ సంఖ్య రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం మాఫీ వెనుకాల ఉన్న వారి ఎత్తులు ఒక రకంగా ఉంటే... రేషన్ బియ్యం అవసరం లేని వాళ్లు వాటిని అమ్ముతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ మధ్య వివిధ ప్రాంతాల్లో తిరిగి ప్రజలతో మాట్లాడిన శాసనసభా కమిటీ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యశ్రీ తోపాటు ఇతర ప్రభుత్వ పథకాల కోసం కొందరు రేషన్ కార్డు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి వారికి రేషన్ అవసరం లేదని అందుకే వారు ఆ రేషన్ తీసుకొని అమ్మేయడమో లేదా రేషన్ డీలర్‌కు వదిలేయడంతో వాళ్లు అమ్ముకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికెట్టేందుకు కేవలం ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యశ్రీ కోసమే రేషన్ కార్డు తీసుకుంటున్న వారికి వేరే కార్డు ఇస్తే సరిపోతుందన్నారు. ఆరోగ్య శ్రీకు వేరుగా కార్డు ఇస్తే వాళ్లకు రేషన్ కార్డు కట్ చేయవచ్చని తెలిపారు. ఫలితంగా రేషన్ పక్కదారి పట్టే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. వారి సూచనలు పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం నేరుగా రేషన్ కార్డు కట్ చేస్తే వ్యతిరేకత వస్తుందని ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తోంది. అలాంటి వారందరి నుంచి ముందే సమాచారం సేకరించి వారికి నిత్యవసర సరకులు ఇవ్వబోతున్నారు. బియ్యం వద్దంటే వారికి కందిపప్పు, నూనెతోపాటు ఇతర సరకులు ఇస్తారు. దీని వల్ల ప్రభుత్వంపై భారం పడినప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని అంటున్నారు. నలుగురు ఉండే కుటుంబంపై ప్రభుత్వం బియ్యం ఇచ్చేందుకు దాదాపు వెయ్యి రూపాయలు ఖర్చు పెడుతుంది. అదే ఖర్చు నిత్యవసరాలు ఇవ్వగలిగితే వారికి కూడా మేలు జరుగుతుందని అంచనా వేస్తోంది. ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు అభిప్రాయసేకరణ చేసిన తర్వాత ఇంప్లిమెంట్ చేయనున్నారు. భవిష్యత్‌లో సన్నబియ్యం కూడా ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వంలో ఉన్నట్టుంది. అప్పుడు మాఫియా మరింత రెచ్చిపోతుందని ఇప్పటి నుంచే దాన్ని కట్టడి చేయాలనే ఆలోచన ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇక్కడ రేషన్ బియ్యాన్ని బ్లాక్‌లో కొంటున్న వాళ్లంతా వాటిని పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసుకున్నారు.

## పర్యాటక రంగ అభివృద్ధి కోసం చంద్రబాబు కొత్త స్కెచ్

కర్నూలు, జూన్ 5, ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పర్యాటక రంగాన్ని ఇండస్ట్రీ కింద గుర్తించిన ప్రభుత్వం.. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తోంది. అలా హోమ్‌స్టే వంటి విధానాల ద్వారా పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు అందించి.. మరింత మంది సందర్శకులను ఆకర్షించాలని ప్రయత్నిస్తోంది. మనదేశంలో గుజరాత్, తమిళనాడు తర్వాత అత్యంత పొడవైన తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఈ నేపథ్యంలో తీర ప్రాంతాన్ని, అలాగే రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక కట్టడాలను మరింత అభివృద్ధి చేసి మరింతమంది పర్యాటకులను ఆకర్షించే ఆలోచనలో ప్రభుత్వం ఇంది.మరోవైపు ఏపీలో టూరిజం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. మరో కొత్త ఆలోచన చేసినట్లు సమాచారం. మంగళవారం అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో దీనిపై చర్చించినట్లు తెలిసింది. ఏజెన్సీ ప్రాంతాలలో హెలిపోర్టులు ఏర్పాటు చేసి.. గిరిజన ప్రాంతాల్లోనూ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనను చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. విశాఖపట్నం, పాడేరు, అరకు, లంబసింగి వంటి ఏజెన్సీ ప్రాంతాలను పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో అలాంటి ప్రాంతాల్లో హెలిపోర్టులు ఏర్పాటు చేయడం ద్వారా సందర్శకులను మరింతగా ఆకర్షించవచ్చనేది ప్రభుత్వం ఆలోచన.హెలిపోర్టు.. అంటే హెలికాప్టర్లు దిగడానికి అనువుగా ఓ ప్రదేశాన్ని తయారు చేయటం.. ఒకటి కంటే ఎక్కువ హెలిప్యాడ్లను ఒకేచోట ఏర్పాటు చేస్తే దాన్నే హెలిపోర్ట్ అని పిలుస్తుంటారు. హెలికాప్టర్ల టేకాఫ్, ల్యాండింగ్, పార్కింగ్ కోసం హెలిపోర్టులు ఏర్పాటు చేస్తారు. అయితే హెలిపోర్టుల ఏర్పాటులో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ప్రమాణాలు పాటించడం తప్పనిసరి. హెలిపోర్టుల వద్ద ఇంధనం, హ్యాంగర్స్ వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. హెలిపోర్టులను ప్యాసింజర్ల ప్రయాణానికి అలాగే అత్యవసర సేవల కోసం సాధారణంగా ఏర్పాటు చేస్తూ ఉంటారు.ఈ నేపథ్యంలో ఇలాంటి హెలిపోర్టుల ద్వారా సందర్శకులు ఏజెన్సీ ప్రాంతాలను సులువుగా చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆలోచిస్తున్నారు. ఈ క్రమంలోనే సీఎం చంద్రబాబు నాయుడు ఏజెన్సీ ప్రాంతాలలో హెలిపోర్టుల ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

## ఊపు ఎక్కడా....

విజయవాడ, జూన్ 5,ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ఈ ఏడాదిలో వైసీపీ పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా వైసీపీకి లభించలేదు. 175 నియోజకవర్గాలకు గాను కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వైసీపీకి వచ్చాయి. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటయిన శాసనసభ సమావేశాలకు కూడా వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కావడం లేదు. దీంతో ప్రజానమస్యలను శాసనసభలో ప్రస్తావించేవారు లేదు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తానని జగన్ పట్టుబట్టడం కూడా ప్రజల్లో ఒకరకమైన వ్యతిరేక భావన ఏర్పడింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వెళతామని అనడం సరికాదన్న కామెంట్స్ బాగానే వినిపిస్తున్నాయి,శాసనసభలో వైసీపీ వాయిస్ లేకుండా పోయింది. ఇది జగన్ పార్టీకి మైనస్ అని చెప్పాలి. అదేసమయంలో జగన్ ఏడాది నుంచి బెంగళూరు నుంచి విజయవాడ కు ట్రిప్పులు వేస్తున్నారు. నెలలో కొన్ని రోజులు మాత్రమే నేతలకు అందుబాటులో ఉంటున్నారు. స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకోవడంతో ఆయన తరచూ లోకల్ లీడర్లతో భేటీ అవుతున్నారు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనన్న నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా స్థానిక సంస్థలన్నీ కూటమి పరమయిపోయాయి. ఇక ఉగాది నుంచి జిల్లాల పర్యటనలు చేస్తానని ప్రకటించిన వైఎస్ జగన్ ఎప్పటికప్పుడు తన పర్యటనను వాయిదావేసుకుంటూ వెళుతున్నారు. ఏడాది కూటమి ప్రభుత్వంలో తమ వారిపై నమోదవుతున్న కేసుల విషయంలోనే జగన్ కొంత పట్టించుకుంటున్నారు. ఏడాది నుంచి నియోజకవర్గాల ఇన్ ఛార్జులతో సమావేశం కాలేదు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. చివరకు తన సొంత జిల్లా కడపలోనూ నేతలతో ఆయన సమావేశమవ్వడం తక్కువేనని అంటున్నారు. ఈసారి అధికారంలోకి వస్తే కార్యకర్తలకు ప్రాధాన్యత నిస్తామని చెబుతున్న జగన్ మాత్రం నేతలకు సంబంధించి ఎటువంటి భరోసా ఇవ్వడం లేదు. గత ఎన్నికల్లో ఇష్టారీతిన నియోజకవర్గాలను మార్చేశారు. నేతలకు పట్టున్న నియోజకవర్గాల నుంచి బయటకు పంపారు. ఈ ప్రయోగం విఫలమయిందని తెలిసినా తిరిగి అక్కడ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో ఏడాదిగా ఆ యా ప్రాంతాల్లో క్యాడర్ అయోమయంగా ఉంది.మరొక వైపు అప్పుడప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేస్తున్నప్పటికీ, మీడియా సమావేశాలు పెడుతున్నప్పటికీ జగన్ ఇంకా పూర్తి స్థాయిలో జనానికి అందుబాటులోకి రాలేదు. తాడేపల్లి కేంద్ర కార్యాలయానికే అధికారంలో లేనప్పుడు కూడా పరిమితమయ్యారు. రైతుల సమస్యలపై కొంత వెళుతున్నప్పటికీ జగన్ 2019 ఎన్నికలకు ముందు చేసిన తరహాలో దీక్షలు, ధర్నాలు వంటివి చేయకపోవడం పార్టీ క్యాడర్ లో ఇంకా ఊపు తెప్పించలేకపోతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అది జనంలోకి బలంగా వెళ్లగలిగేలా మాత్రం ఆయన చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదన్నది మాత్రం యదార్థం.ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడంలో కనీసం యాభై శాతం కూడా సక్సెస్ కాలేకపోయినట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

## ఇమేజ్ పెరిగిందా...డ్యామేజ్ అయిందా

గుంటూరు, జూన్ 5, జనసేన అధినేతగా జనంలోకి వచ్చి అధికారాన్నిచేపట్టిన పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈరోజుకు గత ఏడాది ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జనసేనకు హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు వచ్చింది. ఇరవై ఒక్క అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ గెలిచారు. దాదాపు పదిహేడు శాతం ఓటు బ్యాంకును కూడా సొంతం చేసుకుంది. తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టారు. కీలకమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖతో పాటు తనకు అత్యంత ఇష్టమైన అటవీ శాఖను అడిగి మరీ తీసుకున్నారు. తనతో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కు కేబినెట్ లో అవకాశం కల్పించారు. తొలిసారి మంత్రి పదవి తీసుకోవడంతో కొన్ని రోజుల పాటు తనకు అప్పగించిన శాఖలపై పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి అధ్యయనం చేశారు. కేరళలో ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ్ ను తన టీంలోకి తెచ్చుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో రహదారులు, మంచినీటి సమస్యలను ప్రధానంగా తొలగించేందుకు ఒకింత పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నాలు ఫలించాయని చెప్పాలి. పంచాయతీలకు నిధులు విడుదల చేయించడంలో పవన్ కల్యాణ్ సక్సెస్ అయ్యారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులను నిర్మించి అటవీ పుత్రులకు అండగా తాను ఉన్నానన్న భరోసాను పవన్ కల్యాణ్ ఇవ్వగలిగారు. ఇక ఏనుగుల దాడి నుంచి పంటలను రక్షించేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించడంలో కీలకంగా వ్యవహరించారు.ఇక ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో పవన్ కల్యాణ్ కొన్ని నిర్ణయాల పట్ల మౌనంగా ఉండటం, ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోవడం ఒకింత ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేస్తుందనే చెప్పాలి. పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, తాను పవర్ లోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రశ్నించే వారు ఎక్కువయ్యారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తనకు తాను ప్రకటించుకున్న పవన్ కల్యాణ్ ప్రశ్నల గురించి మానేశారు. ఆయన ప్రభుత్వ నిర్ణయాలకు తలూపటమే ఇప్పుడు విమర్శలకు తావిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత సమస్యల పరిష్కారానికి పాటుపడకపోవడంపై పవన్ మౌనాన్ని సోషల్ మీడియాలో చాలా మంది తప్పుపడుతున్నారు. . నిజానికి ప్రభుత్వంలో ఉండి బహిరంగంగా విమర్శించడానికి అవకాశం లేదు. అంతర్గత సమావేశాల్లోనే తనకున్న అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. చంద్రబాబు కేబినెట్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉండి బహిరంగంగా విమర్శలు చేస్తే అది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుంది. ఎవరైనా ఇలాగేనే చేస్తారు. కానీ పవన్ కల్యాణ్ అంతర్గత సమావేశాల్లోనూ తలూపి రావడం వల్లనే ఈ విమర్శలు ఎక్కువయ్యాయని అంటున్నారు. ఆయన గత ఎన్నికల సందర్భంగా మాట్లాడిన మాటలు, ఇచ్చిన హామీలను ట్రోల్ చేస్తూ వైసీపీ నేతలు పవన్ కల్యాణ్ వెంట పడుతున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ నిజాయితీగా ఉన్నప్పటికీ, తన శాఖల విషయంలో మంచి పురోగతి సాధించినప్పటికీ ప్రశ్నించడం మానేసి ప్రజల్లో చులకనయ్యారంటున్నారు.

# ఆటపాటలతో మానసిక వికాసం



పబ్‌జీ గేమ్‌ను ఆడుతూ, దానికి బానిసలుగా మారి, చావ్లను కొనితెచ్చుకుంటున్నారు చాలామంది. ఇది వరకు స్కూల్స్‌లో కనీసం ఒక గంట పి.టి అవర్ ఉండేది. ఆ సమయంలో ఎవరికి నచ్చిన ఆటలు వారు ఆడుకునేవారు. ఇప్పుడు ఆ ఛాన్స్ కూడా స్కూళ్లలో లేదు. సరే ఇంటికి వచ్చాక ఆడుకుందామంటే ట్యూషన్స్, డాన్స్ క్లాసులకు వెళ్లి వచ్చేసరికి భోజనం చేసే సమయం అవ్తుతుంది. ఆ సమయంలో ఆడుకునే ఆలోచన, శక్తి, ఉత్సాహం పిల్లలకు ఉన్నా ఆడించే మనసు పెద్దలకు ఉండటం లేదు. బయటకు పంపించరు కూడా. ఆడుకోవడానికి వచ్చిన పిల్లలను తిట్టే తల్లిదండ్రులు కూడా ఉన్నారు. పిల్లలకు వేసవి సెలవ్లు ముగించుకుని స్కూళ్లకు వెళ్తున్నారు. మళ్లీ బడిగంటలు మోగాయి. కొందరు పిల్లలు ఇష్టంగా స్కూలుకు వెళ్తుంటే, మరికొందరు ఏడుస్తూ వెళ్లనని మారం చేస్తూ, తల్లిదండ్రులకు మూడుచెరువ్ల నీటిని తాగిస్తున్నారు. స్కూల్ అనగానే ఆటపాటలు బంద్ అనుకుంటారు. కానీ సాయంకాలం ఒక గంటసేపైనా పిల్లలు ఆడుకునేందుకు తల్లిదండ్రులు ఇష్టపడుతున్నారు. ఎందుకంటే క్రీడలు పిల్లల మానసికవికాసానికి దోహదం చేస్తుంది. స్కూల్లో, ఇంటిఆవరణంలో ఒక గంటసేపు అయినా ఆడుకోవడం మంచిదని నిపుణులు అంటున్నారు. గ్రామాల్లోని పిల్లలు కొంతవరకు ఆడుకుంటున్నారు. కానీ పట్టణాలు, నగరాల్లోని విద్యార్థులు, పిల్లలు పెద్దగా కనిపించడం లేదు. కారణం వారు గ్యాడ్జెట్లు, కేఫ్‌లలో తమ సమయాన్ని గడుపుతున్నారు. ఆన్‌లైన్ గేమ్స్‌లతో నాలుగుగోడల మధ్యే ఎక్కువ సమయాన్ని గడుపుతున్నారు. తల్లిదండ్రులు కూడా ఉద్యోగాలు వెళ్లడం, పిల్లల్ని బయటికి వెళ్లనీయకుండా, ఇంటిపట్టునే సురక్షితంగా ఉండేందుకు కంప్యూటర్లు, టీవిలు, ఆన్‌లైన్ గేమ్స్‌లతో గడపమని చెబుతున్నారు. దీంతో వారు ప్లేగ్రౌండ్‌కు వెళ్లి, శారీరకంగా శ్రమపడుతూ, ఆడుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అందుకే గ్రామాల్లోని పిల్లలతో పోల్చుకుంటే, పట్టణాల్లోని పిల్లలకు ఊబకాయం వస్తున్నది. క్రీడలు పిల్లల మానసిక వికాసానికి దోహదం చేస్తుంది. బాల్యం అమూల్యమైన వరం. తిరిగిరాని వసంతం. అందుకే అంటారు పసితనం-పసందైన వయస్సు అని. మనం కొన్నేళ్ల క్రితంలోకి వెళ్లిపోతే చిన్నతనపు జ్ఞాపకాలెన్నెన్నో కళ్లముందు ప్రత్యక్షమవ్తాయి. బడి నుండి రాగానే పుస్తకాల సంచిని పక్కన పెట్టేసి?చుట్టుపక్కల పిల్లలతో ఆటల్లో మునిగిపోయేవాళ్లం. అమ్మమ్మలో, బామ్మలో, మరి అమ్మలో ఇక చాలు ఇంటికెళ్లండి పిల్లలు అంటూ నేస్తాలను సాగనంపి మనల్ని ఇళ్లకి ఈడ్చుకెళ్లేవారు. తాడాట, ఉప్పలకుప్ప, తొక్కుడు బిళ్ల, ఏడుపెంకులాట ఇలా ఏ ఆటవస్తువ్లు అవసరం లేకుండా చుట్టూ ఉన్న పరిసరాలలో మనకు దొరికిన వాటితో ఆడుకునేవాళ్లం. ఇది కాకుండా పండగలకు ప్రత్యేకమైన ఆటలుండేవి. సంక్రాంతి గొబ్బిళ్లో?గొబ్బిళ్లు అంటూ గొబ్బెమ్మల చుట్టూ ఆడిపాడేవాళ్లం. ఇక దసరాకి ఇంటింటికి వెళ్లి వసంతం జిమ్ముతూ పప్పుబెల్లాలు పెట్టమని అల్లరిచేసేవాళ్లం. ఇక అట్లతద్దికి చెప్పనక్కర్లేదు. ఉయ్యాలూగడం, దాగుడుమూతలు, బొమ్మలపెళ్లిళ్లు చేసి బుజబుజ రేకుల పిల్లుంది అంటూ ఆడపెళ్లివారమంటూ చిందులేసేవారం. ఇక నీడపట్టున కూర్చుని ఆడమంటే చింతగింజలు, వామనగుంటలు, వైకుంఠపాళి, అష్టాచెమ్మా ఇవన్నీ మధురానుభూతులు. ఇక ఇప్పటిరోజుల్లోకి వస్తే మన పిల్లలకు ఈ ఆటలాడే సమయం లేదు సరికదా. ఇలాంటి ఆటల ముచ్చట్లు చెప్పుదామన్నా వారికి వినే తీరిక కూడా లేదు. వ్యక్తిత్వ, మానసిక వికాసాలకు ఆటలు తోడ్పడతాయి అని చెపుతూనే విద్యాసంస్థలు కూడా ఈ పోటీకి దీటుగా పిల్లల్ని తీర్చిదిద్దే క్రమంలో ఆ భర్తీని పూరించలేకపోతున్నాయి.


పబ్‌జీ గేమ్‌ను ఆడుతూ, దానికి బానిసలుగా మారి, చావ్లను కొనితెచ్చుకుంటున్నారు చాలామంది. ఇది వరకు స్కూల్స్‌లో కనీసం ఒక గంట పి.టి అవర్ ఉండేది. ఆ సమయంలో ఎవరికి నచ్చిన ఆటలు వారు ఆడుకునేవారు. ఇప్పుడు ఆ ఛాన్స్ కూడా స్కూళ్లలో లేదు. సరే ఇంటికి వచ్చాక ఆడుకుందామంటే ట్యూషన్స్, డాన్స్ క్లాసులకు వెళ్లి వచ్చేసరికి భోజనం చేసే సమయం అవ్తుతుంది. ఆ సమయంలో ఆడుకునే ఆలోచన, శక్తి, ఉత్సాహం పిల్లలకు ఉన్నా ఆడించే మనసు పెద్దలకు ఉండటం లేదు. బయటకు పంపించరు కూడా. ఆడుకోవడానికి వచ్చిన పిల్లలను తిట్టే తల్లిదండ్రులు కూడా ఉన్నారు. కాని రోజులో కనీసం ఒక అరగంట అయినా వారు ఆడుకుంటుంటే వారి మానసిక వికాసం బాగా అభివృద్ధి చెందుతున్నదని మనోవికాసనిపుణులు అంటున్నారు. దీన్ని నమ్మి కొన్ని అపార్టుమెంట్లో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను రోజూ ఓ గంట ఖచ్చితంగా ఆటలకి పంపాలని నిర్ణయించుకుని, ఆవిధంగా పంపుతున్నారు. ఇలా ప్రతి తల్లితండ్రులు ఆలోచిస్తే పిల్లల మానసిక వికాసం బాగుంటుంది. ఆటలు ఆడడం వల్ల టీమ్ మేనేజ్‌మెంట్, షేరింగ్, కలిసిమెలిసి ఉండటం లాంటివి వారికి చాలా విషయాలు తెలుస్తాయి. ఒక గంట ఆడుకుని వచ్చి, కాస్త ఫ్రెష్ అయ్యి చదువ్లకు కూర్చుంటే ఎసైన్‌మెంట్స్ తొందరగా పూర్తిచేసున్నారు పిల్లలు అని కొంతమంది తెలిపారు. అదే ఆటలు వద్దు అంటే? ఆ టైము చదువ్లకు కేటాయించరు సరికదా?కంప్యూటర్ గేమ్‌లు, టివిషోల ముందు కూర్చోవడం కాసేపటి తరువాత టీవి, కంప్యూటర్ ఆఫ్ చెయ్యమంటే వారు విసుగ్గా, కోపంగా, హైపర్‌గా మారడం మేం గ్రహించామని కూడా కొంతమంది తల్లితండ్రులు చెబుతున్నారు. ఆటలాడి వచ్చాక ఉల్లాసంగా మెదడు కూడా చాలా చురుగ్గా పనిచేస్తుంది. శారీరక అలసట ఆరోగ్యానికి మంచిది. ఇప్పటి పిల్లల్లో చిన్నతనంలో వచ్చే ఊబకాయ శరీరాన్ని కూడా తగ్గిస్తుంది. కొద్దిగా సమయపాలన ఉండి, సానుకూలంగా ఆలోచించి, క్రమబద్ధీకరించుట ద్వారా ఎంత సిలబస్, ప్రాజెక్టులు ఉన్నా, ఓ గంట ఆటలకి కేటాయించి వారిని ఆ దిశగా ప్రోత్సహించాలి. నేటి బాలలని రేపటి శక్తివంతమైన, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం ప్రతి తల్లితండ్రుల బాధ్యత. అందుకే మీ పిల్లల్ని మీ అపార్టుమెంట్ కార్‌పార్కింగ్‌ల చుట్టూనో, దగ్గరలోని పార్కులోనో, ఖాళీ స్థలాలలోనే ఆడుకోవడానికి వెడతామంటే, వద్దనకండి. చక్కగా తీరిక చిక్కితే మీరూ ఒక బ్యాటు పట్టుకునో, సైకిల్ తొక్కుతూనో వారితో కొంత సేపు గడిపి అలా బాల్యం లోకి తొంగి చూసి మురిసి పోండి. మరి మీ అందరూ ఆటలకి సిద్ధమే నా! రండి పిల్లల్ని ఆడనిద్దాం. భావిత రాలకు ఆరోగ్య సమాజాన్ని అందిద్దాం.

# మెరిసే చర్మకాంతి కోసం



సౌందర్యాన్ని నిర్వచించినపుడు చర్మకాంతి ముందు వరుసలోనే ఉంటుంది. మెరుపులీనే చర్మం చూసే కళ్లను ఆకట్టుకుంటుంది. అంతేకాదు, వయసుని చెప్పే శారీరక లక్షణాల్లో కూడా చర్మానిదే ప్రధమస్థానం. యవ్వనవంతమైన చర్మం ఉన్నవారు తక్కువ వయసున్న వారిలా కనిపించడం అందరికీ తెలిసిన విషయమే. వయసు పెరుగుతున్న కొద్దీ చర్మకాంతి తగ్గుతుండటం సహజమే. పెదవుల పక్కన, కళ్ల దగ్గర, మెడమీద కనిపించే ముడతలు పెరుగు తున్న వయసుని చెబుతుంటాయి. ప్రత్యేకంగా వయసు కారణంగా చర్మంలో వచ్చే ఇలాంటి మార్పులను నిరోధించేందుకు ఆయా వయసులకు తగ్గ అవసరాలను బట్టి సౌందర్య ఉత్పత్తులు నేడు మార్కెట్‌లో దొరుకుతున్నాయి- అవేమిటో తెలుసుకుందాం.ఇలా వివిధ వయసుల్లో వచ్చే చర్మసమస్యలు నివారించేందుకు మూడు రకాలుగా సౌందర్య ఉత్పత్తులు దొరుకుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే అనారోగ్యానికి వాడే మందుల్లా ఇవి పెరిగే వయసు తెచ్చే మార్పుల నుంచి చర్మాన్ని రక్షించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడినవి.చర్మానికి సంబంధించిన పలు సమస్యల కోసం దొరికే ఎన్నో సౌందర్యసాధనాలు మనకు తెలుసు. అయితే అన్ని సౌందర్య సాధనాలు అంద రికీ ఒకేలా పనిచేయకపోవచ్చు. అందుకే చర్మతీరుని, రంగుని బట్టి వాడేందుకు వివిధ క్రీములు లోషన్లను ఆయా ఉత్పత్తిదారులు తయారుచేసి వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. ఇదే తరహాలో ఇపుడు మరొక ప్రత్యేక పద్ధతిలో సౌందర్య సాధనాలు తయారవుతున్నాయి. వయసుల్లో తేడాలను బట్టి వచ్చే చర్మమార్పులను ఇవి తగ్గించగలుగుతాయి. ఒక రకంగా చెప్పాలంటే అనారోగ్యానికి వాడే మందుల్లా ఇవి పెరిగే వయసు తెచ్చే మార్పుల నుంచి చర్మాన్ని రక్షించేందుకు ప్రత్యేకంగా రూపొందిం చబడినవి. 30 ఏళ్ల లోపు మహిళల చర్మం సున్నితంగా ఉంటుంది. 30 ఏళ్లు దాటితే మొ హంలో వయసు పెరు గుతున్న చిహ్నాలు కన బడుతుంటాయి. నిదానంగా ముడతలు ప్రారంభమవుతాయి. చర్మం తీరుని బట్టి ఇవి కొందరిలో మరింత ఎక్కువగా ఉంటాయి. ఇక 50 ఏళ్ల వయసు దాటితే చర్మంలో మృతకణాలు, పిగ్మం టేష న్ మొదలైన సమస్య లు మొదలవుతాయి. సౌందర్య ఉత్పత్తులు దొరుకుతున్నాయి. సమయం లేని వారు వీటిని వాడవచ్చు.

# క్లెన్సర్లు వాడకంలో జాగ్రత్తలు



ఏ క్రీమ్ అప్లయి చేయాలన్నా ముందు ఫేస్‌వాష్ చేసుకుని అప్లయి చేస్తాం. అంతేకాదు ఎక్కడికైనా వెళ్లి ఇంటికి రాగానే ముఖం కడుక్కుంటాం. చికాకుగా వ్తుంటుంది. కనుక రిలాక్స్ అవడానికి వాష్ చేస్తాం. అలానే వాష్ చేయకుండా ఉంటే ముఖం నల్లమరకలు పడేలా కనిపిస్తుంది. అలా నల్లబడ్డాక బ్యూటీపార్లర్స్, క్రీములు చకచకా వాడేసి మరలా మామూలుగా ఉంటే ప్రయోజనం ఏమి ఉండదు. బైటకెళ్లి రాగానే ఎక్కడున్నా ఫేస్‌వాష్‌ను మరచిపోవద్దు. ఇంట్లో అయితే వాష్‌బేసిన్ పక్కనే సబ్బు కూడా ఉంచండి. నాసిరకం సోప్ వాడకూడదు. ముఖం కడుక్కున్నప్పుడు టవల్‌తో రుద్దేయకుండా అద్దుతూ తుడుచుకోండి. క్లెన్సర్‌లు ఉపయోగించేవారు మంచి కంపెనీవే వాడండి. కనీసం ప్రతిరోజు ముఖం మూడు, నాలుగు నుండి సోప్ క్లెన్సర్‌లు ఉపయోగించటం వల్ల చర్మరక్షణకు, సౌందర్యానికి మంచిది. మంచి క్లెన్సర్ చర్మాన్ని మృదువుగా ఉంచటంతో పాటు మంట లాంటివి కలిగించదు. పొడిచర్మం గలవారికి క్రీమ్‌లాంటి క్లెన్సర్ కావాలి. పొడిచర్మం కలిగిన వారు నీటిలో కరిగిపోయే క్లెన్సర్ వాడటం మంచిది. వాష్ క్లాత్ బ్యాక్టీరియా కేంద్రంగా మారి పరోక్షంగా మొటిమలు తెప్పించేలా చేయగలవ్ల అందుచేత జాగ్రత్త వహించాలి. అనవసరమైన సువాసనలు, నూనెలు కలిగి ఉండే క్లెన్సర్‌లు, క్రీములు కొనకండి. క్లెన్సర్ ఉపయోగించిన తరువాత చర్మం అయిల్‌గా గాని, పొడిగా గాని, పొరగా ఉన్నట్లుగాని అనిపించ కూడదు. బ్యూటీపార్లర్‌లో వాడే మాయిశ్చ రైజర్స్ కొన్నిరకాల రసాయనాలతో తయారుచేస్తారు. బ్యూటీషియన్స్‌కి ఏవి మంచివో, ఏవి హానిచేస్తాయో తెలుసు కాబట్టి సరైన నిర్ణయం తీసుకుంటారు. నీటికొరత కలిగించి [illegible] కరిగిపోతుంది.

# ఆధ్యాత్మికత వాస్తవరూపం ఏమిటి?

ఆధ్యాత్మిక ఉద్యమం 1936-1937 సంఎలోనే చాలా కొద్దిమంది సభ్యులతో సత్సంగంగా ఆరంభమై సర్వ ఆత్మలను ఒక దగ్గరకు చేర్చింది. నిరాఖారు జ్యోతిబిందు స్వరూపుడైన పరమాత్మ శివబాబా ఆజ్ఞానుసారం పరమపిత బ్రహ్మాబాబా దీనిని ఆరంభించారని చెబుతారు. ప్రజాపిత బ్రహ్మాబాబా పూర్వం దేశానికి స్వతంత్ర్యంరాని రోజులవి. భారతావని విదేశీ దాస్య సృంఖలాల విముక్తి కోసం ఉదృ తంగా ఉద్యమిస్తున్న రోజులవి. వైడూర్యాలు వ్యాపారం చేస్తూ కోట్లకు పడగలెత్తిన వ్యాపారి. వ్యాపారం పట్ల ఎంత శ్రద్ధాశక్తులు ఉన్నాయో, భక్తి విశ్వాసాలు, ఆచార సాంప్రదా యాలపట్ల, పూజాది కార్యక్రమా లపట్ల విశేష శ్రద్ధ కనబరిచేవారట. సకల అష్టఐశ్వరాలు, పంచభక్ష పర మాన్నాలు తినగలిగే స్థాయి అయినా కేవలం సాత్విక జీవనాన్ని అలవ రుచుకున్న సాధుశీల. నిరాడంబరుడు. బ్రహ్మాబాబా అని అంటారు. 60వ ఒడిలో బడ్డ బ్రహ్మాబాబాకు పరమపిత పరమాత్మ శివ్లని ద్వారా అలౌకిక సాక్షాత్కారం లభించింది. ఆ సమయంలోనే భూతకాలంనాడు జరిగిన వినాశనంతోపాటు, భవిష్యత్, వర్తమాన కాలాదులను తన దివ్యజ్ఞాన నేత్రం ద్వారా చూడగలిగిన రాజర్షి బ్రహ్మ బాబా రాబోయే ప్రపంచం యొక్క రూపురేఖలు చూసినట్లు చెప్తారు నూతనయుగం ఆరంభానికి ముందే ఒక వినూత్న ఆధ్యాత్మిక ఉద్యమానికి శ్రీకారంచుట్టారు. ఎవరి ద్వారా ఐతే ఒకవర్గం బంధికా బడి, చిక్కుకున్నదో, వారి విముక్తి కోసమే వారిలో ఉన్న ఆత్మశక్తిని జాగృతం చేసేందుకు, యోగ విద్యద్వారా రాజయోగాన్నిలో శిక్షణ నిచ్చేందుకు సిద్ధం చేశారు. యోగం ద్వారా సిద్ధించే ఫలాన్ని తొలుత మాతలకు, కన్యలకు, చిన్నారులకు, వెనకబడ్డ వారికి, సంపన్నవర్గాలకు సైతం సరళతరమైన సాధన ప్రక్రియను అందించిన కృషీవలులు బ్రహ్మాబాబా. ఈ క్రమంలో నూతన ప్రపంచమంటే సత్యయుగమని అది ప్రేమ, పవిత్రలతో కూడిన ప్రపంచమని అంటారు. ఈ ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు తన సరస్వాన్ని త్యాగం చేశారని అంటారు. ఉద్యమం ఆరంభించిన తొలినాళ్ళలోనే సవాళ్ళను ఎదుర్కోక తప్పలేదు. సవాళ్ళను ఎదుర్కొనేందుకు సంసిద్ధుడైన పరమపిత బ్రహ్మ అహింస ద్వారానే సమర్థవంతంగా ఎదుర్కొవాలని నిర్ణయించారు. తద్వార దివ్యజ్ఞానాన్ని దివ్యత్వాన్ని పొందారు. అది అసాధారణం అద్భుతం, అద్వితీయ, అనిర్వచనీయమని అది మాటలకు అందని దివ్య అనుభూతిగా వర్ణిస్తారు బ్రహ్మకుమారీలు. అధ్యాత్మిక విప్లవానికి ఆధారం ఆధ్యాత్మకత ఆత్మసంబంధమైన అంశాలను విశ్లేషించడం ఆత్మికరసంబంధమైన, మౌలిక సూత్రాలద్వారా మాత్రమే ప్రపంచానికి ప్రేమభావన వసుధైక కుటుంబ భావనను ప్రపంచ మానవాళికి అందించిన ఆధ్యాత్మికవేత్త ప్రజాపిత బ్రహ్మ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ స్థాపన జరిగిందని విశ్లేషకుల అభిప్రాయం. ఆధ్యాత్మికత, ఆత్మికభావన అన్న పదాలు భారతదేశానికి కొత్తకాదు. వాస్తవానికి ఆధ్యాత్మికత వాస్తవరూపం ఏమిటి? వ్యక్తిమనసు, మాటకర్మ, తనువ్ల, ధనం. శ్వాస సమయం, శక్తిద్వారా మార్చే ప్రతిఫ లాన్ని వ్యక్తికి, వ్యవస్థను సమాజాన్ని కళ్యాణకారకం కాగలదన్నది బ్రహ్మాబాబా ప్రగాఢమైన విశ్వాసం. ఉదా:- మొత్తం శరీరంపై దృష్టిపెట్టనిదే సమస్యను తెలుసుకోలేం. సమస్యను తెలుసుకోకుండా వైద్యం చేయడం సాధ్యమా? సమస్య మూలాన్ని కనుక్కున్నప్పుడే, సమస్యా త్మకభాగాన్ని తొలగించగలం, అతికించ గలం. సాధ్యంకా నపుడు విడిచిపెట్టడం తప్ప మరోమార్గం లేదు. ప్రజాపిత బ్రహ్మాబాబా ప్రపంచంలోని ప్రతి ఒకవ్యక్తిలో సంపూ ర్ణమైన శాంతిని పవిత్రతను పావనమైన ఉన్నతమైన సద్గుణాలతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించేందుకు తాను ఒక అద్భుతమైన మానవీయమూర్తిగా చేసిన కృషి శ్లాఘనీయం. సవ్యమైన ఈశ్వరీయజ్ఞానం, సహజరాజయోగాన్ని పునర్జీవింప చేయడం ద్వారా కామ, క్రోధ, లోభ, మోహ అహంకారం వంటి వికారాలను ఇంద్రియ నిగ్రహంద్వారా జయించే సులభమైన మార్గం తెలియచేశారు. స్వరాజ్యానికి అధికారులుగా రాజధిరాజులుగా తీర్చిదిద్ది విశ్వమానవాళిని మేల్కొల్పిన రాజర్షి. ఆధ్యాత్మిక విప్లవం యొక్క విత్తనం బాల్యంనుండే చేయగలరు అన్నదే ప్రజాపిత బ్రహ్మాబాబా విశ్వాసం. ప్రపంచంలో ఎందరో ధర్మమూర్తులు

# మహిళలకు ఇబ్బంది లేకుండా..


మమతకు కొత్తగా పెళ్లై అత్తింటికి వెళ్లింది. అది ఒక గ్రామం. ఇంట్లో మరుగుదొడ్డి అవకాశం లేదు. దీంతో ఆమెకు బయటకు వెళ్లాలంటే అదోలా అనిపించేది. ఎప్పుడూ ఆమె ఆవిధంగా వెళ్లలేదు. దీంతో ఆమెకు అత్తింట్లో ఉండాలంటేనే అయిష్టత పెరగసాగింది. ఇదే విషయం పుట్టింటికి చెప్పింది. మమత తల్లిదండ్రులే కాస్త డబ్బు సాయం చేసి, అత్తింట్లో మరుగుదొడ్డిని నిర్మించారు. ఇది ఆమె సాధించిన విజయం. ఆడవారికి బాత్‌రూమ్‌లు లేవనో, మరుగుదొడ్లు చాలవనో ఏ రాజకీయవేత్త దృష్టికో తీసుకెళ్తే ఒకటో,రెండో సామూహిక మరుగుదొడ్లు మంజూరు చేశామని చెప్పేసి దానికో భారీఎత్తున శంకుస్థాపన కార్యక్రమాలు శిలాఫలకాలకు కొబ్బరి కాయలు కొట్టడాలు షరామామూలే. అవి పూర్తయ్యాయో లేదో. పూర్తయితే మహిళలకు సౌకర్యంగా ఉన్నాయో లేదో రోజువారీ శుభ్రతా నిర్వహణ జరుగుతుందో లేదో అని పరకాయించేవారే ఉండరు. ఆ మహిళల్లో మాత్రం ప్రభుత్వ నిర్వాకానికి సిగ్గుపడి మళ్లీ నోరెత్తరు. దేశమంతటా ఇదే పరిస్థితి. మహిళలకు, బాలికలు చెప్పుకోలేని సమస్యలెన్నో ఉంటాయి. వాటి గురించి ఆలోచించి ఉద్యమించే మహిళా సంఘాలూ తక్కువే. ఇటీవల ఓ సర్వేలో పాఠశాలకు కెళ్లే బాలికలకు నాప్‌కిన్స్ అంటే తెలియవని వెల్లడైంది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులు చూస్తే ఏటా సకాలంలో బాలికలకు నాప్‌కిన్‌లు అందిస్తున్నట్లే ఉత్తర్వులుంటాయి. అమలు సంగతి, ఆచరణ సంగతి ఆ లోగుట్టు పెరుమాళ్ల కెరుకే. ఇక గ్రామీణ ప్రాంతాలలో మరుగుదొడ్లు లేక మహిళలు ఎన్ని ఇబ్బందులు పడ్తున్నారో ఇల్లు దాటి రోడ్ల మీదకు



రావాలంటే ఎంత సిగ్గుపడుతున్నారో ఊహించుకుంటే ఏమాత్రం అర్థంకాని విషయం కాదు. తీరా మరుగుదొడ్ల కెళ్తే అక్కడ భద్రతా సమస్య. నమోదవ్తుతున్న అత్యాచారాల్లో కొన్ని మహిళలు మరుగుదొడ్లకు వెళుతున్నపుడే అని చదువ్తుతుంటే సభ్యసమాజం సిగ్గుతో తలదించు కోవాల్సిందే. ఈసారి అక్కడ అత్యధిక మహిళలు ఎన్నిక కావడంతో తమ తొలియత్నంగా మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యంపై శంఖం పూరించారు.

# ప్రేమలోనే భక్తి ఉంది

నూనె తలకు రాసుకొని సీసాకు మూతపెట్టడం మరచిపోతూ ఉంటారు కొందరు. స్నానాల గదికి వెళ్లే ముందు లైట్ వేసుకొని, తిరిగి వచ్చిన తరువాత స్విచ్‌ఆఫ్ చేయటం మరిచిపోతారు మరికొందరు. ఇక, కళ్ళజోళ్లు మరిచిపోయేవారు, చేతిగుడ్డలు పడేసుకొనే వారైతే లెక్కకు అందని సంఖ్యలో ఉంటారు. రోజూ ఇలా జరుగుతూ ఉండినా, అప్పటికి అదే క్రొత్త అన్నట్లు ఉంటుంది. ఇది అలవాటు సృష్టించిన దుస్థితియో, లేదా అయోమయం కల్పించిన పరిస్థితియో అనేది వేరే విషయం. కాని, మనకే నచ్చని ఈ విషయం నుండి విడిపడటానికి చాలాకాలం పడుతుంది. సామాన్య విషయాలే ఇలా ఉన్నాయి. ఒక్కక్షణాన ఎవరో వచ్చి "తత్త్వమసి నీవే బ్రహ్మము అనగానే జీవత్వము జారిపోతుందా? ఆంతర్యం నుండి పారిపోతుందా? ఇదేమన్నా గారడివిద్యనా? చాలాకాలం ఒక గాడిలో పడి ప్రయాణం చేస్తేగాని భ్రమ తొలగదు. ప్రేమ కలగదు. బహుకాల సంస్కారాలు, బహుకాల సాధనల వల్లనే పోతాయి. నీవ్ల బ్రహ్మమే. ప్రతిబంధకాలు ఎవరివి? నీవ్ల సృష్టించుకున్నవే. వాటిని అలాగే ఉంచుకొని, బ్రహ్మంగా ఊరేగాలంటే సాధ్యమా? ఆలోచన ఒక్కటే సరి పోదు. ఆచరణ కూడా ఉండాలి. బహిరంగ సాధనతో పాటు అంతరంగ సాధన కూడా సాగుతూ ఉండాలి. "నాకు అంతా తెలుస్తూనే ఉంది. శాస్త్రం అర్థం అవ్తూనే ఉంది. కాని మనస్సు భగవంతుని మీద క్షణం నిలవటం లేదు. ప్రతిక్షణం పరుగులే ఇవీ ఫిర్యాదులు. మనస్సు పరుగులెత్తుతూ ఉంది అనేది వాస్తవమే. కాని, మనస్సు భగవంతునికి దూరంగా పరుగులెత్తుతూ ఉంది అనేది సత్యం కాదు. ఎంత దూరం పరుగులెత్తినా మనస్సు చైతన్యానికి దూరంగా పరుగులెత్తలేదు. చైతన్యం ఎవరో కాదు. భగవంతుడే. అనంతుడైన భగవంతునికి మనస్సు దూరంగా వెళ్లలేదు అనే సత్యం వంటపడితేనే శాస్త్ర అర్థమయిందని నిశ్చయం. ఇంత సుస్పష్టంగా, స్వచ్ఛంగా కనిపిస్తున్న సత్యం నిజజీవితంలోకి, నిత్య జీవితంలోకి రావటం ఎంత దుర్లభంగా ఉందో చూశారా? పామరులు సరే, శాస్త్రాధ్యయనం చేసిన పండితులూ అలాగే అంటున్నారు. సాధకులు అలాగే మాట్లాడుతున్నారు. సన్యాసులు కూడా అలాగే ఆలోచిస్తున్నారు. రోజూ అలవాటుగా మరచిపోయే విషయాల్లాగా, పరమాత్మను స్మరిస్తూనే ఉన్నాం. విస్మరిస్తూనే ఉన్నాం. అనాదిగా అంటిపెట్టుకొని వస్తున్న అనాచారాలు క్షణాల్లో పండుటాకులు రాలినట్లు రాలవ్ల. దూదిముక్కల్లా దురదృష్టాలు గాలిలోకి ఎగిరిపోవ్ల. క్షణక్షణాన్ని వినియోగించుకోవాలి. ప్రతిక్షణాన్ని పవిత్రంగా కాపాడు కోవాలి. బాహ్యంలో ఏది జరుగుతున్నా ఆంతర్యంలో స్మరణ సాగుతూ ఉండాలి. ఇష్టాయిష్టాలను ప్రక్కన పెట్టాలి. ధర్మాధర్మాలను అర్థం చేసుకొంటూ నడక సాగించాలి. నీకు ఇష్టమైనదని అధర్మాన్ని చేయకూడదు. నీకు అయిష్టమని ధర్మాన్ని త్యజించకూడదు. యుద్ధం భయంకరమే. అయినా అందులో ధర్మం ప్రవేశించి ఉ సిద్ధపడు అన్నాడు శ్రీకృష్ణుడు. యుద్ధం కురుక్షేత్రానికే పరిమితం కాదు.




# 2000 మంది మధ్యలో తారక్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ థ్రిల్లర్ గా 'డ్రాగన్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. చిత్రీకరణలో ఎన్టీఆర్ సహా ప్రధాన పాత్ర ధారులంతా పాల్గొంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ పై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. 2000 మంది జూనియర్ ఆర్టిస్టుల మధ్య లో తారక్ ఉన్న సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. దీంతో ఇది భారీ సన్నివేశమని తెలుస్తోంది. ఇంత మంది మధ్యలో తారక్ ఇంత వరకూ ఏ సినిమా కోసం పని చేయలేదు. గతంలో 'ఆర్ ఆర్ ఆర్' చిత్రీకరణలో పాల్గొన్నారు. ఆ సన్నివేశాల్లో వందల మంది మాత్రమే పాల్గొన్నారు. రెండు వేల మంది మధ్యలో సీన్స్ అంటే? ఈ సన్నివేశం ప్రత్యేకత హైలైట్ అవుతుంది. పీరియాడిక్ మాస్ యాక్షన్ కథతో కూడా సబ్జెక్ట్ కావడంతోనే భారీ కాన్వాస్ పై తెరకెక్కి స్తున్నారు. ఈ సినిమా కోసం తారక్ బాగా సన్నబడిన సంగతి తెలిసిందే. శారీరకంగా చాలా మార్పులు తీసుకొచ్చాడు. మునుపటి కంటే మరింత సన్నరివ్వలా తయారయ్యాడు. అందుకోసం ప్రత్యేకమైన డైట్ ఫాలో అయ్యారు. దీంతో వెయిట్ లాస్ బాగా జరిగింది. ఈ నేపథ్యంలో తారక్ లుక్ ఎలా ఉంటుంది? అన్న దానిపై ఆసక్తి నెలకొంది. మీడియా కెమెరాల్లో కనిపించినా? డ్రాగన్ లుక్ ఎలా ఉంటుంది? అన్న దానిపై అంతకంతకు ఆసక్తి రెట్టింపు అవుతుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ కోసం ఫ్యాన్స్ ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నారు. ఇందులో తారక్ కి జోడీగా కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ నటిస్తోంది. మరి ఈ సినిమాలోనైనా హీరో-హీరోయిన్ మధ్య రొమాంటిక్ సన్నివేశాలకు డైరెక్టర్ చాన్స్ తీసుకుంటాడా? 'కేజీ ఎఫ్','సలార్' తరహాలోనే హీరోయిన్ పాత్రను పరిమితం చేస్తాడా? అన్నది చూడాలి. వచ్చే ఏడాది జూన్ లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# స్టార్ హీరోయిన్ 25 ఏళ్ల కెరీర్‌ని నడిపించినది?

"ఒక నటి నిజమైన కొలత ఇన్‌స్టాగ్రామ్ లైక్‌లు లేదా రెడ్ కార్పెట్ అప్పియరెన్స్ కాదు..క్రాఫ్ట్ నా ఆయుధం" అని ప్రకటించారు సీనియర్ నటి కరీనా కపూర్ ఖాన్. హిందీ చిత్ర పరిశ్రమలో 25 ఏళ్ల అద్భుతమైన ప్రయాణాన్ని గుర్తు చేస్తూ, కరీనా కపూర్ ఖాన్ (44) జూన్ 2025లో ది నోడ్ మ్యాగజైన్ ముఖచిత్రాన్ని అలంకరించారు. నిజాయితీగా కరీనా తనను ముందుకు నడిపిస్తున్న సూపర్ పవర్ గురించి, సంవత్సరాలుగా ఇండస్ట్రీలో ఏమి మారిందో కూడా మాట్లాడింది. ఇద్దరు బిడ్డలకు తల్లి అయినా నటనలో మెరుపులు మెరిపించడంలో వెనక్కి తగ్గని ఈ బ్యూటీ, నటన పరంగా ప్రదర్శించే సామర్థ్యమే నటీనటులకు గౌరవాన్ని పెంచుతాయని అన్నారు. కభీ ఖుషీ కభీ ఘమ్, జబ్ వి మెట్, క్రూ సహా ఎన్నో చిత్రాలలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను పోషించిన కరీనా ఈ పాత్రలతో తాను వ్యక్తిగతంగా సంతృప్తి చెందానని తెలిపారు. కమర్షియల్ సినిమాలతో పాటు, డిజిటల్ సిరీస్ లకు ప్రాధాన్యతనిస్తున్న బెబో డెప్త్ ఉన్న పాత్రల వైపు ఎక్కువగా ఆకర్షితురాలవుతానని తెలిపింది. నన్ను నేను సవాల్ చేసుకునే, ఉత్తేజపరిచే పాత్రలు చేస్తాను. నేను నా శక్తిని, నా ప్రతిభను, నన్ను నేను కాపాడుకోవాలనుకుంటున్నాను.. అని కూడా బెబో వ్యాఖ్యానించింది. కెరీర్



మ్యాటర్ కి వస్తే, కరీనా చివరిసారిగా క్రూలో కనిపించింది. ఆ తర్వాత సింగం ఎగైన్‌లో కనిపించింది. ఇవి రెండూ 2025లో విడుదలయ్యాయి. తదుపరి దైరాలో కనిపిస్తుంది. మేఘనా గుల్జార్ దీనికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా నటిస్తున్నారు.


# ఆ రెండిటి మీద శ్రీలీల ఆశలు..?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల ఇలా వచ్చి అలా తన యాక్టింగ్ డ్యాన్స్ లతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ధమాకా హిట్ తో టాప్ లీగ్ లోకి వెళ్లిన శ్రీలీల ఆ వరుసలోనే స్టార్ అవకాశాలు తెచ్చుకుంది. చేసిన సినిమాలు కొన్ని ఫ్లాప్ అవ్వడం వల్ల అమ్మడికి షాక్ తగిలినట్టు అయ్యింది. ఒకటి రెండు ఛాన్స్ లు చేతిదాకా వచ్చి చేజారాయి. ఐతే ఇక అమ్మడి పని అయిపోయిందా అనుకునే సరికి మళ్లీ పుంజుకుంటుంది. శ్రీలీల తెలుగులో రెండు సినిమాలు చేస్తుంది. అందులో ఒకటి మాస్ జాతర కాగా మరొకటి లెనిన్. ఈ రెండు సినిమాలు కూడా మంచి అంచనాలతో వస్తున్నాయి. అఖిల్ సరసన మొదటిసారి జత కడుతున్న శ్రీలీల లెనిన్ అంటూ రాబోతుంది. సినిమా టీజర్ ఇంప్రెస్ చేయగా సంథింగ్ స్పెషల్ గా ప్రాజెక్ట్ ఉండేలా ఉంది. మరోపక్క మాస్ జాతర సినిమా కూడా రవితేజ మార్క్ మాస్ ఎంటర్టైనర్ గా వస్తుందని తెలుస్తుంది. ఈ రెండు సినిమాల మీదే శ్రీలీల తన ఆశలన్నీ పెట్టుకుంది. తెలుగులో మళ్లీ వరుస అవకాశాలు రావాలంటే మాత్రం ఇవి హిట్టు పడాల్సిందే. టాలీవుడ్ లో కాకుండా శ్రీలీల కోలీవుడ్ లో పరాశక్తి సినిమా చేస్తుంది. శివ కార్తికేయన్ హీరోగా సుధ కొంగర డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఆ మూవీపై కూడా ఇంట్రెస్టింగ్ బజ్ నడుస్తుంది. వీటితో పాటు బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ తో శ్రీలీల ఆషికి 3 సినిమా చేస్తుంది. ఆషికి 2 ఎంత పెద్ద హిట్టైందో తెలిసిందే. ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ ఆషికి 3 వస్తుంది. ఆ సినిమాలో శ్రీలీల ఛాన్స్ అందుకోవడం గొప్ప విషయం. ఈ సినిమా అంచనాలను అందుకుంటే మాత్రం శ్రీలీల బాలీవుడ్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకునే ఛాన్స్ ఉంది. ఇవే కాకుండా మరో రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుంది. ఐతే అక్కడ ఇక్కడ ఏమో కానీ శ్రీలీల మాత్రం తెలుగులో తన సత్తా చాటాలని చూస్తుంది. ఎందుకంటే తెలుగులో చేస్తున్న పాన్ ఇండియా సినిమా ఛాన్స్ అందుకుంటే నేషనల్ వైడ్ గా పాపులారిటీ తెచ్చుకునే అవకాశం ఉందని అలా సెట్ చేస్తుంది అమ్మడు. మరి అమ్మడి ప్రయత్నాలు ఎంతవరకు వర్క్ అవుట్ అవుతాయో చూడాలి.

# విశ్వక్ ఫంకి ప్లానింగ్ ఏంటో..?

: మాస్ కా దాస్ విశ్వక్ సేన్ లైలా తర్వాత చేస్తున్న సినిమా ఫంకీ. లైలా అంచనాలను అందుకోకపోవడంతో ఈసారి ష్యూర్ షాట్ హిట్ టార్గెట్ తో వస్తున్నాడు విశ్వక్ సేన్. విశ్వక్ ఫంకీ సినిమాను జాతిరత్నాలు దర్శకుడు అనుదీప్ కెవి డైరెక్ట్ చేస్తున్నాడు. శివ కార్తికేయన్ తో ప్రిన్స్ సినిమా తర్వాత విశ్వక్ తో సినిమా చేస్తున్న అనుదీప్ ఈ సినిమా కూడా తన మార్క్ ఎంటర్టైనర్ గా ఉంటూనే విశ్వక్ సేన్ మాస్ ఫ్యాన్స్ కోరుకునే అంశాలను పొందుపరుస్తున్నట్టు తెలువ్వుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా డ్రాగన్ బ్యూటీ కయదు లోహార్ ని ఫిక్స్ చేశారు. అంతకుముందే శ్రీ విష్ణుతో అల్లూరి సినిమా చేసిన కయదుని అప్పుడు మనోళ్లు పట్టించుకోలేదు. కానీ డ్రాగన్ సినిమాలో ఆమె గ్లామర్ పర్ఫార్మెన్స్ అన్నీ ఆమెను మళ్లీ ట్రాక్ లోకి వచ్చేలా చేశాయి. డ్రాగన్ తర్వాత కయదుకి అటు తమిళంలో కూడా క్రేజీ ఆఫర్స్ వస్తున్నాయి. ఆల్రెడీ అక్కడ శింబు నెక్స్ట్ సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. విశ్వక్ సేన్ తో కయదు జోడీ తెలుగు ఆడియన్స్ ని ఖుషి చేస్తుంది. ఐతే ఫంకీ సినిమా సెట్స్ మీదకు వెళ్లి ఆరు నెలలు పైన అవుతుంది. అనుదీప్ ప్రతి సినిమాను ఇలా సెట్స్ మీదకు తీసుకెళ్లడమే ఆలస్యం అలా ఆరు నెలల్లో పూర్తి చేసి రిలీజ్ చేస్తాడు. మరి విశ్వక్ సేన్ ఫంకీ విషయంలో ప్లానింగ్ ఎలా ఉందో తెలియాల్సి ఉంది. ఫంకీ సినిమా ఈ ఇయర్ లోనే రిలీజ్ ఉండే ఛాన్స్ ఉంది. ఐతే అది దసరా తర్వాత తెస్తారా లేదా డిసెంబర్ లో ప్లాన్ చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది. విశ్వక్ సేన్, అనుదీప్ ఇద్దరి కాంబినేషన్ లో రాబోతున్న ఫంకీ కచ్చితంగా మాస్ కా దాస్ ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. ఫంకీతో హిట్ ట్రాక్ ఎక్కితే మాత్రం విశ్వక్ సేన్ నెక్స్ట్ సినిమాలు కూడా అదిరిపోయేలా ప్లాన్ చేస్తాడని చెప్పొచ్చు. విశ్వక్ సేన్ సినిమాలు రిలీజ్ ముందు బాగానే బజ్ ఏర్పరచుకుంటాయి కానీ రిలీజ్ తర్వాత ఆశించిన ఫలితాన్ని అందుకోవట్లేదు. గత రెండు మూడు సినిమాల్లో ఇదే సీన్ రిపీట్ అవుతుంది. అందుకే ఈసారి విశ్వక్ సేన్ పర్ఫెక్ట్ ప్లానింగ్ తో వస్తున్నాట్టు తెలుస్తుంది. అక్కడ ఉంది అనుదీప్ కాబట్టి రిలీజ్ ప్రమోషన్స్ పిచ్చెక్కించడమే కాదు సినిమా కూడా సక్సెస్ రూట్ లోనే వెళ్లేలా చేస్తాడని చెప్పొచ్చు.






# మెగా-మాస్ పోటీ.. అనార్కలి నిలిచేనా?

మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర సినిమాను ఇదే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసిన మేకర్స్ వీఎఫ్ఎక్స్ వర్క్ చేస్తున్నారు. ఈ ఏడాది చివరి వరకు చిరంజీవి విశ్వంభర తో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. విశ్వంభర సినిమా ఏ సమయంలో వచ్చినా చిరంజీవి తదుపరి సినిమా ను మాత్రం కచ్చితంగా 2026 సంక్రాంతికి విడుదల చేయడం కన్ఫర్మ్. ఇప్పటికే దర్శకుడు అనిల్ రావిపూడి ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించాడు. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబో మూవీ జెట్ స్పీడ్‌తో షూటింగ్ జరుపుకుంటుంది. కనుక సంక్రాంతి రేసు నుంచి తప్పుకోవడం అనేది అసాధ్యం. 2026 సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబో మూవీ రానున్న నేపథ్యంలో చిన్న సినిమాలు విడుదల ఉండక పోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అయింది. కానీ షాకింగ్‌గా మాస్ మహారాజా రవితేజ నుంచి 2026 సంక్రాంతికి రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. కిషోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ హీరోగా ఒక సినిమా రాబోతున్న విషయం తెల్సిందే. ఆ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఇంకా ప్రారంభం కానప్పటికీ సినిమాను వచ్చే సంక్రాంతికి విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. ఈ ఏడాదిలో రవితేజ మాస్ జాతర సినిమాను విడుదల చేయబోతున్నారు. అందుకు సంబంధించిన ప్రకటన వచ్చింది. రవితేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా లో కేతిక శర్మ, ఆషికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటించబోతున్నారు. ఈ విషయమై అధికారికంగా ప్రకటన వచ్చేసింది. ఈ సినిమాకు ఉన్న బజ్ నేపథ్యంలో సంక్రాంతికి విడుదల చేయడం అనేది మంచి నిర్ణయం అంటూ అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు మాత్రం చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబో మూవీకి పోటీ అంటే కచ్చితంగా స్వయంగా తమ సినిమాను కిల్ చేసుకోవడమే అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు. బాలకృష్ణ డాకు మహారాజ్ సినిమా 2025 సంక్రాంతికి విడుదల అయ్యి సంక్రాంతికి వస్తున్నాం సినిమా కారణంగా ఎంతగా నష్టపోయిందో మనకు తెలిసిందే. ఆషికా రంగనాథ్, కేతిక శర్మలు హీరోయిన్‌లుగా నటించబోతున్న అనార్కలి సినిమాతో మాస్ మహారాజా మరోసారి తన మాస్ యాంగిల్‌ను చూపించబోతున్నాడు. అదే సమయంలో చిరంజీవి వింటేజ్ లుక్‌తో, పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్‌తో అనిల్ రావిపూడి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అనిల్ రావిపూడి ట్రాక్ రికార్డ్, అది కాకుండా సంక్రాంతికి ఆయన జోరు ముందు రవితేజ అనార్కలి నిలిచేనా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ మధ్య కాలంలో మంచి సినిమాలను కాస్త సేఫ్ జోన్‌లో విడుదల చేస్తేనే తప్ప వసూళ్లు వచ్చే పరిస్థితి లేదు. కనుక మినిమం గ్యాప్‌తో సినిమాను విడుదల చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



## పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(విజయ సారథి):మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు.గురువారం కర్నూలు నగర శివార్లలోని గార్గేయపురం నగరవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వానమహోత్సవం - 2025 కార్యక్రమంలో భాగంగా మె?క్కలు నాటి, అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ.శ్యాంబాబు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1972 సంవత్సరం జూన్ 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా డిక్లేర్ చేసినప్పటి నుండి ప్రతి సంవత్సరం జూన్ 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్రతి సంవత్సరం ఒక థీమ్ ను నిర్దేశించుకుని, ఆ థీమ్ ను అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది "ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే థీమ్ తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ ను మనం మన దినచర్యలో బాగా ఉపయోగిస్తున్నామని, నియంత్రణ లేకుండా ఎక్కువగా ఉపయోగించడం వల్ల మానవ జాతికి, పర్యావరణానికి సమస్యలు ఏర్పడతున్నాయన్నారుప్లాస్టిక్ ఉపయోగించి పడేసిన తర్వాత అది విచ్ఛిన్నం కాదని, భూమి కింద అలాగే ఉండిపోతుందన్నారు.దీని వల్ల వర్షం పడినప్పుడు వర్షపు నీరు కింది భూమిలోకి పోదని, తద్వారా గ్రౌండ్ వాటర్ పెరగదన్నారు.ఈ విధంగా కొన్ని లక్షల మంది, కోట్ల మంది

# మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ప్లాస్టిక్ ఉపయోగించి పడేస్తూ ఉన్నారని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ ను ఉపయోగించకుండా బంద్ చేయాలన్నారు.చెట్లు లేకపోతే మానవ మనుగడ ఉండదన్నారు. భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని వాతావరణం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ వీలైనన్ని మొక్కలు నాటాలన్నారు.పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత అన్నారు.కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్లాస్టిక్ ను ఎంత తక్కువగా మనం ఉపయోగిస్తే అంత మంచిదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే మన జీవనశైలిని పర్యావరణాన్ని పరిరక్షించుకునే విధంగా మార్చుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన గాలి లభిస్తుందని, కాలుష్యాన్ని తగ్గించగలుగుతామని, తద్వారా సకాలంలో వర్షాలు పడి రైతులు సుభిక్షంగా ఉంటారన్నారు.పత్తికొండ ఎంఎల్ఏ కే.ఈ.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ వాతావరణం బాగుంటే ఆరోగ్యాలు బాగుంటాయన్నారు.మన జిల్లాలో పరిశ్రమలు ఉన్నాయని, సంబంధిత పరిశ్రమలకు పొల్యూషన్ కంట్రోల్ స్ట్రిక్ట్ నార్మ్స్ తీసుకొని రావాలన్నారు.జిల్లాలో ఉన్న ప్రతి పాఠశాలలో మొక్కలు నాటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పిల్లలకు వాటి



ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరు వారి వారి ఇళ్ల వద్ద చెట్లు పెంచాలని కోరారు.కార్యక్రమంలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులు నగరవనంలో మొక్కలు నాటారు..అనంతరం చిల్డ్రన్ పార్క్ ను ప్రారంభించారు.కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్, డిఎఫ్ఓ శ్యామల, ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ రవిశంకర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, మెప్మా పిడి నాగశివ లీలా, టూరిజం అధికారి విజయ, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏపిఎమ్ఐపి పిడి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం : డి ఆర్ ఎం సుధేష్ణ సేన్



గుంటూరు జూన్ 05 : పర్యావరణ పరిరక్షణ ప్రోత్సహించే లక్ష్యంతో గుంటూరు రైల్వే డివిజన్ గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు డిఆర్ఎం సుధేష్ణ సేన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం,పచ్చదనాన్ని పెంచడంపై దృష్టి సారించి అన్ని స్టేషన్లలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలియజేశారు. పర్యావరణ అనుకూల అలవాట్లను అలవర్చుకుంటామని డిఆర్ఎం నేతృత్వంలో అధికారులు మరియు సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన కల్పించడానికి వేదికలపై ర్యాలీ నిర్వహించారు. కాన్కర్స్ వీధి నాటకం కూడా ప్రదర్శించారు. నల్లపాడు లోని ఫైట్ డిపోలో చెట్ల పెంపకం కార్యక్రమం జరిగింది. డివిజనల్ కార్యాలయం మరియు గుంటూరు స్టేషన్ లో చేపట్టిన కార్యకలాపాలలో కె. సైమన్, జె.వి. అనూష, ఎం.రవి కిరణ్, సిహెచ్. ప్రదీప్, జె.శ్రీనాథ్, జి.రత్నాకర్, మధుసూదన రావు, జి. సూర్యనారాయణ మొదలైన బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశంలో మరల ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(విజయ సారథి):రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశంలో మరల ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి కలెక్టర్ డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాక్సిడెంట్ కేసులను నిర్లక్ష్యంగా తీసుకోకుండా యాక్సిడెంట్ జరిగిన ప్రదేశానికి వెళ్లి, రోడ్డు బాగులేకపోవడం వల్ల యాక్సిడెంట్ జరిగి ఉన్నట్లయితే, మరల ప్రమాదం జరగకుండా వెంటనే మరమ్మతులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు.మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన యాక్సిడెంట్లకు సంబంధించి కమిటీ, సంబంధిత అధికారులు జారీ చేసిన సూచనలు ఖచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు..ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనుల నెలలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎన్హెచ్ అధికారులను ఆదేశించారు.పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్హెచ్ కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు అంశం మాస్టర్ ప్లాన్ లో ఉందని, అందుకు సంబంధించిన పనులు మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. ఉల్చాల, గాయత్రి ఎస్టేట్ జంక్షన్ అభివృద్ధి పనులలో పురోగతి తీసుకొనిరావాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారిచే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగుల అటెండెంట్ ల కోసం అన్ని సౌకర్యాలతో విశ్రమాలయం నిర్మించడానికి ముందుకు వచ్చినా వారికి స్థలాన్ని కేటాయించడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని కలెక్టర్ జి జి హెచ్ హాస్పిటల్ ఏవో ను ప్రశ్నించారు.. విశ్రమాలయ పను వెంటనే మొదలుపెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ముందు ఉన్న పండ్ల దుకాణాలకు కూడా హాస్పిటల్ లోపల ఒక స్థలంలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిష్కరించాలని కలెక్టర్ కలెక్టర్ జి జి హెచ్ ఏఓ కు సూచించారు. ప్రైవేట్ అంబులెన్సుకు సంబంధించి కమిటీ నిర్ణయించిన ధరలను ప్రజలకు తెలిసే విధంగా సూచించారు. రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్ ప్రదేశాలలో నేషనల్ హైవే అధికారులు దాదాపు 2 కోట్ల రూపాయల విలువగల పనులను చేశారని కలెక్టర్ నేషనల్ హైవే పిడి లను అభినందించారు.. రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్ లలో నేషనల్ హైవే నార్మ్స్ ప్రకారం ప్రమాదాల నివారణకు వీలుగా తీసుకున్న చర్యలకు సంబంధించిన ఫోటోగ్రాఫ్స్ బుక్లెట్ రూపంలో డాక్యుమెంటేషన్ తయారు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాళ్లదొడ్డి వద్ద రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఎస్హెచ్ ప్లాన్ కింద కోటి రూపాయలు మంజూరు అయ్యాయని, వాటికి టెండర్ లు పిలుస్తున్నామని ఆర్ అండ్ బి ఎస్ఈ కలెక్టర్ కి వివరించారు..ఆటోలలో ఓవర్ లోడింగ్, మోటార్ సైకిల్ ట్రిపుల్ రైడింగ్, ఇతర ట్రాఫిక్ వయోలేషన్ లపై చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. హిట్ అండ్ రన్ కి సంబంధించి బాధితులకు నష్ట పరిహారం ఇప్పించాల్సిన కేసులు కర్నూలు ఆర్డీఓ వద్ద ఎక్కువ పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పాఠశాలలు రీఓపెన్ అవుతున్నాయని, ప్రతి పాఠశాలకు సంబంధించిన బస్సులు, వ్యాన్ల ఫిట్నెస్ ను పరీక్షించాలని, వాటిపై నిఘా పెట్టాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. స్టేట్ హైవే, నేషనల్ హైవే లో స్పీడ్ బ్రేకర్ లు అవసరమైన ప్రాంతాల్లో పరితగతిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణ పై చాలా వీడియోలు చేశామని, వాటిని నగరంలోని ముఖ్య కూడళ్లలో ప్రదర్శించేందుకు ఒక మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. అలాగే నాణ్యత కలిగిన బ్రీత్ అనలైజర్ లను కూడా ఏర్పాటుఃచేయాలని ఎస్పీ కోరారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి , కర్నూల్ మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, పంచాయతీ రాజ్ ఈఈ మద్దన్న , ఆర్టీవో భరత్ చౌహన్, అడిషనల్ డీఎంహెచ్వో భాస్కర్, డిసిహెచ్ శ్రీనివాస రావు , జి జి హెచ్ ఏవో సింధు సుబ్రహ్మణ్యం ,నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరు పని చేయాలి



నిజాంపట్నం జూన్ 05 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంపీడీఓ ఎన్.నాగలక్ష్మి అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం - వన మహోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి మొక్కలు నాటారు.కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి కాంతమ్మ, నిజాంపట్నం పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ టీఏ జాఫర్, కార్యాలయ సిబ్బంది తదితరులు.

## రామాలయం భూమి స్వాధీనం



నిజాంపట్నం జూన్ 05 : ఆక్రమణకు గురైన. దేవాలయం భూమి స్వాధీనం చేసుకున్న అధికారులు నిజాంపట్నం మండలం ముత్తు పల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం తాలూకు ముత్తుపల్లి గ్రామ డి నెంబర్ 115/1 లో 1.05 సెంట్ల మాగాణి భూమి ఆక్రమణకు గురైంది.ఆక్రమణకు గురైన భూమిని ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ ట్రిబునల్ నందు కార్య నిర్వాణాధికారి ఎం నాగయ్య దావా ఫైల్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ ట్రిబ్యునల్ వారు ఓ ఏ నెంబర్ 486/2011 దావాలోల గల సర్వే నెంబరు115/1 లో య 1.05 సెంట్లభూమిని స్వాధీనం చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు సదరు ఉత్తర్వుల ప్రకారం గురువారం భూమిని స్వాధీనం చేసు కున్నామనీ అధికారులు తెలిపారు.

## కౌలురైతులకు పెట్టుబడి సాయంగా రూ 20 వేలు ఇవ్వాలని డిమాండ్



ఆచంట జూన్ 05 :వాస్తవ కౌలురైతులకు పెట్టుబడి సాయం రూ 20 వేలు ఇవ్వాలని, భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలురైతుల సంఘం తహశీల్దార్ కి వినతి పత్రం సమర్పించి అన్నదాత సుఖీభవ 20 వేల రూపాయలు భూమిలేని కౌలురైతులు, వాస్తవంగా సాగుచేసే కౌలు రైతులకు ఇవ్వాలని ఏపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో ఇచ్చే పెట్టుబడి సాయం ఆరుగాలం కష్టపడి పంటలు పండించే కౌలురైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన కౌలు చట్టాన్ని రద్దు చేసి కూటమి ప్రభుత్వం తయారు చేసిన చట్టాన్ని వెంటనే అమలుచేసి గుర్తింపు కార్డులు లేని కౌలురైతులను గుర్తించి పెట్టుబడి సాయం, ప్రభుత్వ రాయితీలు,బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ ద్వారా వినతిపత్రం అందజేశారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




నంద్యాల(విజయ సారథి):పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావడం వల్ల పర్యావరణానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్, ప్రొహిబేషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆవరణంలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు గాను పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా కలెక్టరేట్, ప్రొహిబేషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆవరణంలో సుమారుగా 120 మొక్కలు నాటడం జరిగిందన్నారు. మొక్కలు నాటి అక్కడితో వదిలేయకుండా రోజు వాటికి కొంత సమయం కేటాయించి వాటికి నీరు అందించడం ద్వారా భవిష్యత్తులో మంచి నీడనిచ్చి ప్రాణవాయువును కల్పిస్తుందన్నారు. 76వ వన మహోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క థీమ్ 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' ద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు.

## జిడిసిసిబి ఛైర్మన్ గా మక్కెన మల్లికార్జునరావు

### ప్రమాణ స్వీకారానికి హాజరైన మంత్రి అచ్చం నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి

వినుకొండ జూన్ 05 : జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ప్రమాణ స్వీకార మహోత్సవానికి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి. ఆంజనేయులు హాజరయ్యారు.ప్రమాణ స్వీకారం అనంతరం మక్కెన మల్లికార్జునరావును అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార బ్యాంకు ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సహకార బ్యాంక్ రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతారని, బ్యాంకు ద్వారా రుణాలు, మరియు బీమా ఇతర సామాజిక రక్షణ సౌకర్యాలు అందుతాయని



నూతనంగా ఎన్నికైన జిడిసిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు రైతుల అవసరాలకు అనుగుణంగా తగిన సేవలందించి వ్యవసాయ అభివృద్ధికి, రైతు అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు నిశ్శంకరరావు శ్రీనివాసరావు మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జీవకోటికి ముప్పులేని జీవితాన్ని కొనసాగిస్తాం ఎన్జీఓ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం




పెద్దవడుగూరు(విజయ సారథి):ప్రకృతిని ప్రేమిద్దాం..పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేద్దాం.. ప్లాసిక్ వినియోగాన్ని అడ్డుకుందాం...మొక్కలు నాటి ప్రకృతి విపత్తులు రాకుండా మనల్ని మనం కాపాడుకొందామని పలువురు అధికారులు పిలుపునిచ్చారు.

# కాలుష్య రహిత సమాజాన్ని తయారు చేద్దాం

గురువారం పెద్దవడుగూరు గ్రామంలో సుమంత్ ఎన్విరాన్మెంటల్ రూరల్ అగ్రికల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీవో బారాన్ సాహెబ్, ఎస్ .ఐ.ఆంజనేయులు, వెలుగు ఏపీఎం ఖలీల్, జాతీయ ఉపాధి పథకం ఏ పి డి..పుల్లారెడ్డి, ఐసీడీఎస్. సూపర్వైజర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు ఏర్పడి, ప్రకృతిలో అనేక అనర్థాలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, రుతువులలో మార్పు లాంటి అనర్థాలకు మూలం పర్యావరణ పరిరక్షణలో మనిషి చేసిన నిర్లక్ష్యం అని వారు వివరించారు. ఎక్కడపడితే అక్కడ గనుల తవ్వకాలు జరగడం, భారీగా పెరిగిన వాహనాల సంఖ్య, పరిశ్రమల ఏర్పాటుతో జరుగుతున్న వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం ప్రాణులు మనుగడకు కష్టంగా మారిందని ఆందోళన. వ్యక్తం చేశారు..ఈ నేపథ్యంలో మనిషితోపాటు ప్రకృతిలో గల అనేక ప్రాణుల ను కాపాడేందుకు పర్యావరణ పరిరక్షణ జరగాలని అభిప్రాజం వ్యక్తం చేశారు.ముఖ్యంగా మనిషి స్వార్థ ప్రయోజనాల కోసం అడవుల్ని ఇష్టారాజ్యంగా నరికివేయడం తో అనేక అనర్థాలు జరుగుతున్నాయని తెలిపారు.ఈ ముప్పు నుండి ప్రకృతిని కాపాడేందుకు అడవుల సంరక్షణ జరగాలనీ,అదే విధంగా మొక్కలు విరివిగా నాటి సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వందలాది మొక్కలు నాటారు.కాగా సంస్థ అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ మొక్కుబడిగా మొక్కలు నాటడం కాకుండా నాటిన ప్రతి మొక్కను పరిరక్షిస్తామని ప్రకటించారు.అనంతరం స్త్రీశక్తిభవనం, అంగన్వాడి కేంద్రాల వద్ద సుమారు వందమొక్కలు నాటించి ప్రధాన వీధుల వెంట ర్యాలీప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధిహామి పథకం ఇన్ఛార్జ్ ఏపీవో విజయ్, సుమంత్ ఎన్విరాన్మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు రామాంజనేయులు, ఆదర్శ మండల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సుజాత, ఉపాధిహామి పథకం క్షేత్రస్థాయి సహాయకులు శ్రీనివాసులు, జనచైతన్య, వివేకనంద సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మే11 న వైఎస్ షర్మిలా రెడ్డి కర్నూలు పర్యటన విజయవంతం చేద్దాం
### సిటీ ప్రెసిడెంట్ షేక్ జిలాని భాష



కర్నూలు(విజయ సారథి):ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కర్నూలు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కర్నూల్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష తెలియజేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో జిలాని భాష మాట్లాడుతూఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో షర్మిలమ్మ పర్యటనలు ఉన్నాయని వాటిలో భాగంగా కర్నూలు జిల్లాలో ఈనెల 11వ తేదీన సాయంత్రం మూడు గంటలకు షర్మిలమ్మ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగే కార్యకర్తల సమావేశమునకు విచ్చేయుచున్నారని కనుక ఈ సమావేశమునకు కాంగ్రెస్ నాయకులు, నియోజక వర్గాల కోఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమమును విజయవంతం చేయవలెనని జిలాని భాష తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఎస్ ప్రమీల, ఏ వెంకట సుజాత, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎన్ సుంకన్న కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుభాన్, అబ్దుల్ హై, ఐఎన్టియుసి ఆర్ ప్రతాప్ కిషోర్, గోవిందు, శేఖర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన భారీ ర్యాలీ




నంద్యాల(విజయ సారథి):ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణ మున్సిపల్ కార్యాలయం నుండి పద్మావతి నగర్‌లోని ఇండోర్ స్టేడియం వరకు పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు మరియు పౌరులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించే ఉద్దేశంతో భారీ ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ అనంతరం ఇండోర్ స్టేడియం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ సహాయ కమిషనర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఇంజనీర్, గనుల శాఖ సహాయ సంచాలకులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, ప్రజల పాత్ర, తీసుకోవలసిన చర్యలపై ప్రసంగించారు. కార్యక్రమంలో జెఎస్డబ్ల్యు సిమెంట్స్, రామ సిమెంట్స్,ఎస్బిఐ ఆగ్రో కెమికల్స్, ప్రైవేట్ ఆసుపత్రులు తదితర సంస్థలు పాల్గొని ర్యాలీ మరియు మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో తమ పాత్రను పోషించాయి.

## అరుణోదయ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఆముదాలవలస(విజయ సారథి):ఆముదాలవలస రూరల్ అరుణోదయ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్లాస్టిక్ నిషేధించాలని మొక్కలు పెంపకంలో తప్పకుండా శ్రద్ధ తీసుకోవాలని గ్రామీణ ప్రాంతాలలో స్కూల్స్ లో కాలేజీలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని సమస్త డైరెక్టర్ అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. సంవత్సరానికి ఒక్కరోజు మాత్రమే కాదు ప్రతి ఒక్కరు జన్మదిన వేడుకలు వినోదాలు జరుపుకున్నప్పుడు తప్పకుండా ఒక మొక్క నాటాలని ఆ చెట్టు మనకి ప్రాణ వాయువును అందించి మన జీవన మనుగడను కాపాడుతుంది అని అన్నారు. ఆదరణ నిలయం ప్రాంగణంలో ఔషధ మొక్కలు పండ్ల మొక్కలను జిల్లా ఎస్సీ సెల్ తెలుగుదేశం పార్టీ పొన్నాడ అప్పల సూరి, కే బాలలక్ష్మి, రిటైర్డ్ చీఫ్ హెల్త్ ఆఫీసర్ అప్పలరాజు, కేసారం సాంబమూర్తి సింహాచలము కృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# ఘనంగాఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



కాకినాడ(విజయ సారథి):కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలో ఉద్యాన శాఖ ఆద్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఘనంగానిర్వహించడం జరిగింది. అందులో భాగంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటడం ఇరిగింది. 7 ఎకరాలు భూములో వరుపుల రామకృష్ణ పొలంలో 100% రాయితితో మొక్కలు పంపిణి చేసి నాటడం జరిగింది. ఆయిల్ పామ్ మొక్కలు హెక్టార్ కు గాను మొక్కలకి, ఎరువులకి, అంతరపంటకు 4 సం.గాను సుమారుగా 70,000/- రూ రైతులకు అందించడం జరుగుతుంది. 25 సం.పైబడిన ఆయిల్ పామ్ పెద్ద తోటలను అండర్ ప్లాంటేషన్ రాయితీలు అందుబాటులో వున్నాయి. బోర్ బావి క్రింద అగ్రికల్చర్ సాగు చేస్తున్న భూమిలో ఆయిల్ పామ్ వేసుకోవాలి అని రైతులకు తెలీయజేశారు. పోలో ల్యాండ్స్ గురించి రైతు సేవ కేంద్రం లో వివరాలు అందించాలి అని తెలిపారు. ప్రతి ఆయిల్ పామ్ రైతు ఉపాదా మీ పథకంద్వారా అందుబాటులో ఉన్న వినియో గించుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఏ. శ్రీవల్లి , ఏపీ ఆయిల్ ఫెడ్ ఏరియా ఆఫీసర్ ఎన్. హేమలత, ప్రత్తిపాడు ఫీల్డ్ ఆఫీసర్ ఏ. రామకృష్ణ, సర్పంచ్ ఎన్. సురేష్ కుమార్, బిజెపి నాయకులుకంద వీరస్వామి, కర్రి ధర్మరాజు, దళే నూకరాజు (నీటి సంఘం ప్రెసిడెంట్), రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం.. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దాం

### ఆత్మకూరు మండలంలోని పంపనూరు వద్దనున్న నగరవనంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సిఎఫ్ఓ యశోదాబాయి, తదితరులు



అనంతపురం(విజయ సారథి):ఆత్మకూరు మండలంలోని పంపనూరు గ్రామం వద్దనున్న నగరవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2025 సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సిఎఫ్ఓ యశోదాబాయి, తదితరులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2025లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం.. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దాం.. పచ్చని పుడమిని భావితరాలకు అందిద్దాం అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, రాప్తాడు ఎమ్మెల్యే, సిఎఫ్ఓ తదితరులు పాల్గొని మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, జిల్లాలో విస్తృతంగా మొక్కల పెంపకం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎ.మాలోల, ప్రోగ్రాం అధికారి గురు ప్రభాకర్, ఆర్డీఓ కేశవనాయుడు, ఎస్డీసి రామ్మోహన్, అటవీ శాఖ ఎఫ్ఆర్ఓలు శ్రీనివాసులు, మధుబాబు, చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీఈవో రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీం భాష, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపిడిఓ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం సామాజిక బాధ్యతకాదు, వ్యక్తిగత బాధ్యత..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
### వైవియూ ప్రాంగణంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవం - 2025 లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం
### డిఎఫ్ఓ తో కలిసి మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్



కడప(విజయ సారథి):మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగానే కాకుండా.. వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. ''హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా జూన్ 5వ తేదీ నుండి జర్తీక మాసం వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవాన్ని గురువారం యోగివేమన యూనివర్సిటీ ప్రాంగణంలో శ్రీకారం చుట్టడం జరిగింది. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, గౌరవ అతిథులుగా డిఎఫ్ఓ వినీత్ కుమార్ (టెరిటోరియల్), డిఎఫ్ఓ (సామాజిక వన్య అటవీ సంరక్షణ), కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, వైవియూ రిజిస్ట్రార్ పద్మ, డ్వామా పీడి అదిశేషారెడ్డి, డిపివో రాజ్యలక్ష్మి లు హాజరై వారి పేర్లతో కేటాయించిన స్థలంలో అడవి జాతి మొక్కలు నాటి 'హరితాంధ్ర ప్రదేశ్' లక్ష్య సాధనకు శ్రీకారం చుట్టారు. ×× అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి తల్లిలాంటిదని, ప్రకృతికి ప్రాణాదారం అయిన చెట్లు ప్రాణికోటికి ప్రాణాదారం అని మొక్కల యొక్క విశిష్టతను క్షుణ్ణంగా తెలియజేశారు. పర్యావరణం పరంగా గతంలో జరిగిన నష్టాలను పూరించే దిశగా ఈ తరం యువత సమాజాన్ని పునర్నిర్మించాలని పిలుపునిచ్చారు. కరోనా లాంటి విఫత్కర పరిస్థితిలో కృత్రిమ ఆక్సిజన్ ను వేలాది రూపాయలు చెల్లించి ఎన్నో అవస్థలు పడిన పరిస్థితులను గుర్తు చేశారు. హరితాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి ఇల్లు, ప్రతీ ఊరూ పచ్చదనంతో సింగారిద్దామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖతో కలిసి జూన్ 5 పర్యావరణ దినోత్సవం రోజు నుండి వచ్చే కార్తీక మాసం వరకు వర్షాలు విరివిగా కురిసే సీజన్ కావడంతో ఈ వన మహోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో మన జిల్లాలో దాదాపు 4 కోట్ల మొక్కలను నాటే లక్ష్యం నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ తమ చుట్టూ వున్న పరిసరాలను పచ్చదనంతో నింపాలని ఆయన ఆకాంక్షించారు. మన కుటుంబంలో పుట్టినరోజు, పెళ్లిరోజు లాంటి ప్రత్యేక రోజుల్లో వారిచేత ఒక మొక్కను నాటించే అలవాటు నేర్పించాలన్నారు. మొక్కలను వ్యక్తిగతంగా అభిమానిస్తూ మన ఇంటి పరిసరాల్లో, మనకు చేరువలో పచ్చదనాన్ని ఉంచుకోవాలని యువతను కోరారు. మనం నాటిన మొక్కలను మనమే క్రమం తప్పకుండా సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించాలన్నారు. డిఎఫ్ఓ వినీత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా విస్తీర్ణంలో అడవులు 33% విస్తరించి ఉన్నాయని, అటవీ విస్తీర్ణంలో జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం అడవుల్లో 28.47% ఉన్న పచ్చదనాన్ని 33% శాతంకు పెంచేందుకు సామాజిక అడవుల పెంపకం ద్వారా, గ్రామీణ ఉపాధి హామీ పథకం భాగస్వామ్యంతో ప్రజలకు ఓ వైపు ఉపాధి కల్పిస్తూనే పచ్చదనాన్ని పెంచడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవం ద్వారా జిల్లాలో 4 లక్షలకు మించి విస్తృతంగా మొక్కలు నాటి 33% ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 50% కు పెంచేందుకు కృషి చేస్తాం అన్నారు. హరితాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ప్రతిజ్ఞ.అనంతరం వనమహోత్సవం సందర్భంగా జిల్లా అటవీశాఖ వారు హరితాంధ్ర ప్రదేశ్ సాధనకు పచ్చని చెట్లే ప్రగతికి సోపాన మార్గాలని గుర్తెరిగి ప్రకృతి సమతుల్యతలకు అనుగుణంగా ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగ పరుస్తాం. వనాలను నరకబోము,నరకనివ్వము. ప్రతి ఇంటా, ప్రతి ఊరా విరివిగా మొక్కలు నాటి సంరక్షిస్తామని కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో ప్రతిజ&జ చేయించారు. కార్యక్రమానికి ముందుగా గౌరవ, ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం గావించగా.. అనంతరం "స్థానిక అటవీ పునరుద్ధరణ పథకం-2025" ద్వారా యోగివేమన యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన "యోగి వనం" ను జిల్లా కలెక్టర్, డిఎఫ్ఓ లు ప్రారంభించారు. అనంతరం అటవీ శాఖ వారు జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల్ని తెలియజేసే ఛాయాచిత్రాల గ్యాలరీనీ జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో విశిష్టమైన సేవలు అందించిన.. మధుసూదన్ రెడ్డి.(బోటనీ ప్రొఫ్రీసర్), అంకాల్, మునెయ్య, ద్వారకా నాథరెడ్డి, లక్ష్మీరెడ్డి లు సమాజ హితం కోసం చేసిన సేవలను ప్రశంసిస్తూ వారికి అవార్డులను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యోగి వేమన యూనివర్శిటీ, అటవీశాఖ, డ్వామా, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.
### :పిఎసి సభ్యులు ముద్రగడ బహిరంగ లేఖ.



కాకినాడ(విజయ సారథి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన వెన్నుపోటు దినం జూన్ 4 నజరిగిన కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గం నాలుగు మండలాల వరిధి నలుమూలల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం ప్రత్తిపాడులో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతం కావడంతో ముద్రగడ పద్మనాభం నియోజకవర్గ ప్రజలకు, అభిమానులకు,స్నేహితులకు, వైసిపి కార్యకర్తలకు బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ ఎంతో ఉత్సాహంతో ఎండను కూడా లెక్కచేయకుండా భారీ సంఖ్యలో తరలివచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. వెలకట్టలేని ప్రేమ, మీలో కల్మషం లేని నవ్వు, అభిమానం ఉత్సాహం చూసి నాకు నేను చలించిపోయానన్నారు. ఆరోగ్యం కొంచెం ఇబ్బంది పెట్టడం వల్ల వైసిపి తలపెట్టిన కూటమి ప్రభుత్వం వెన్నుపోటు కార్యక్రమానికి నేను హాజరకాలేకపోయినందుకు క్షమించమని లేఖలో పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాల బంధం, ఈరోజుకి మా కుటుంబంపై ప్రేమ చూపడం మా అదృష్టం అన్నారు. మీ ప్రేమ ఎప్పటికీ మరువలేనని, మీ సేవకే బద్ధులై ఉంటామని మనస్ఫూర్తిగా హామీ ఇస్తూ మరొక్కసారి శిరసు వంచి ప్రతి ఒక్కరికి పేరుపేరునా పాదాభివందనాలని లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు వారు ఇచ్చిన సహకారానికి ముద్రగడ ధన్యవాదాలు తెలియజేశారు.

## అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం



చింతలపూడి జూన్ 5 చింతలపూడి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కం జూనియర్ సివిల్ జడ్జ్ సిహెచ్ మధు బాబు గారు అన్నారు అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చింతలపూడి కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ మధు బాబు. మొక్కలు నాటారు పర్యావరణ కాలుష్యం జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని అన్నారు మన ఇంటిలోని వ్యర్థాలను పొడి తడిగా విభజించి పునరుత్పత్తి చేయడం ద్వారా పెరట్లో మొక్కలకు ఎరువుగా ఉపయోగపడుతుంది ప్రతి ఒక్కరూ చెట్లను నాటడం ద్వారా పర్యావరణం కలుషితం కాకుండా కాపాడుకోవచ్చు అన్నారు ఈ కార్యక్రమంలో చింతలపూడి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మాణిక్యాలరావు కోర్టు సూపర్డెంట్ పి జి నాయుడు న్యాయవాదులు కోర్టు సిబ్బంది పి ఎల్ వి అక్బర ఆలీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## పర్యావరణాన్ని కాపాడాటనికి మొక్కలు నాటాలి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం, జూన్ 5 పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, నియోజకవర్గంలోని ప్రజలు ప్రకృతిని రక్షించే బాధ్యతను తీసుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటిన నాడు హరిత ఆంధ్ర ప్రదేశ్ సుసాధ్యం అవుతుందని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా తాడేపల్లిగూడెం ఇండోర్ స్టేడియం దగ్గర హరిత ఆంధ్ర ప్రదేశ్ వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడి రాష్ట్ర అభివృద్ధి కొరకై ప్రతి ఒక్కరు మొక్కలు నాటి భవిష్యత్తు తరాల వారికి స్వచ్ఛ వాయువును అందించాలని వారు ప్రజలను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని మున్సిపాలిటీలు మరియు పంచాయతీలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com